ఆంధ్రజ్యోతి


ANDHRAJYOTHY

5 తిరుపతి

జిల్లా వార్తలు

శనివారం 20 ఏప్రిల్ 2024

ఫైర్ డే



- రేణిగుంటలో 44.4 డిగ్రీల ఉష్ణోగ్రత
- 24మండలాల్లో వడగాడ్పులతో ఠారెత్తిన జనం

తిరుపతి(కలెక్టరేట్), ఏప్రిల్ 19:ఎండ తీవ్రత, వడగాడ్పులతో జిల్లా నిప్పుల కొలిమిగా మారింది. శుక్రవారం ఉదయం 8నుంచీ సాయంత్రం 5గంటల వరకు తీవ్ర వేడి వాతావరణం కొనసాగింది.తిరుపతి నగరంలో ఎండ తీవ్రతకు రోడ్లన్నీ నిర్మానుష్యంగా మారాయి. రేణిగుంటలో 44.4 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదయింది. తిరుపతి అర్బన్‌లో 43.4డిగ్రీలు, డక్కిలిలో 42.79, తిరుపతి రూరల్‌లో 42.23, వెంకటగిరిలో 42.09, ఏర్పేడులో 41.93, నాయుడుపేట, బాలాయపల్లి, తొట్టంబేడు, చంద్రగిరిల్లో 41.9 డిగ్రీలు,శ్రీకాళహస్తిలో 41.5 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. 24మండలాల్లో 40 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదు కాగా అత్యల్పంగా కోటలో 35.3,ఆలంపూడిలో 34.2డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

- సీన్ రివర్స్



అక్కడ మూశారు ఇక్కడ ఎగబడ్డారు

తక్కువ ధర.. బ్రాండెడ్ మద్యం దొరుకుతుందని జిల్లాలోని మందుబాబులు తమిళనాడుకు వెళ్లడం సాధారణం. కానీ, శుక్రవారం మాత్రం తమిళనాడు మందుబాబులు మద్యం కోసం లోక్ మెమో రైళ్లలో సూళ్లూరుపేటకు తరలివచ్చారు. మద్యం దుకాణాలన్నీ వీరితో కిటకిటలాడాయి. మండుటెండలోనూ మందుబాబులు క్యూలో నిలబడడం విశేషం. ఎందుకిలా రివర్సులో వచ్చారని అనుకుంటున్నారా? తమిళనాడులో పార్లమెంటు ఎన్నికల వల్ల బుధవారం నుంచి శనివారం వరకు మద్యం షాపులు మూసేశారు. ఈ నాలుగు రోజులు ఆగలేక.. ఇలా వచ్చారిక్కడికి.

- సూళ్లూరుపేట

రెండవ రోజు 20 నామినేషన్లు

తిరుపతి ఎంపీకి 3... ఏడు అసెంబ్లీ స్థానాలకు 17

తిరుపతి, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో రెండవ రోజైన శుక్రవారం 20 నామినేషన్లు దాఖలయ్యాయి. తిరుపతి పార్లమెంటు స్థానానికి మూడు, ఏడు అసెంబ్లీ స్థానాలకు 17 చొప్పున మొత్తం 20 మంది అభ్యర్థులు 22 సెట్ల నామినేషన్లు దాఖలు చేశారు. తిరుపతి పార్లమెంటు స్థానానికి వైసీపీ అభ్యర్థిగా సిట్టింగ్ ఎంపీ మద్దిల గురుమూర్తి, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా మాజీ కేంద్ర మంత్రి చింతా మోహన్ కలెక్టరేట్‌లో నామినేషన్లు దాఖలు చేశారు. వైసీపీ డమ్మీ అభ్యర్థిగా గురుమూర్తి సతీమణి నవ్యకిరణ్ నామినేషన్ వేశారు. నాలుగు అసెంబ్లీ నియోజకవర్గాల్లో టీడీపీ అభ్యర్థులు శుక్రవారం నామినేషన్లు దాఖలు చేశారు. వెంకటగిరిలో టీడీపీ అభ్యర్థిగా మాజీ ఎమ్మెల్యే రామకృష్ణ కుమార్తె కురుగొండ్ల లక్ష్మీ సాయిప్రియ, గూడూరులో టీడీపీ అభ్యర్థిగా మాజీ ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్, సూళ్ళూరుపేటలో టీడీపీ అభ్యర్థిగా మాజీ ఎమ్మెల్యే నెలవల సుబ్రమణ్యం కుమార్తె డాక్టర్ విజయశ్రీ, సత్యవేడులో టీడీపీ అభ్యర్థిగా ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం నామినేషన్లు వేశారు.రెండు సెగ్మెంట్లలో వైసీపీ, మరో రెండు నియోజకవర్గాల్లో కాంగ్రెస్ అభ్యర్థులు నామినేషన్ పత్రాలు సమర్పించారు. గూడూరులో వైసీపీ అభ్యర్థిగా ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్, తిరుపతిలో వైసీపీ అభ్యర్థిగా డిప్యూటీ మేయర్ అభినయ్‌రెడ్డి నామినేషన్లు వేశారు. చంద్రగిరిలో కాంగ్రెస్ తరపున శ్రీనివాసులు అలియాస్ వాసు, సూళ్ళూరుపేటలో కాంగ్రెస్ అభ్యర్థి గాదె తిలక్ బాబులు నామినేషన్లు దాఖలు చేశారు.

ఆరు చోట్ల ఇతరుల నామినేషన్లు : గూడూరులో టీడీపీ డమ్మీ అభ్యర్థిగా గోను సంధ్యారాణి, సూళ్ళూరుపేటలో వైసీపీ డమ్మీ అభ్యర్థిగా కిలివేటి సుభాషిణి, వెంకటగిరిలో టీడీపీ డమ్మీ అభ్యర్థిగా మాజీ ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ, రాడికల్ పార్టీ ఆఫ్ ఇండియా తరపున షేక్ షఫీ, ఇండిపెండెంట్‌గా ఉయ్యూరు ఆర్ముగం, తిరుపతిలో సోషలిస్ట్ యూనిటీ సెంటర్ ఆఫ్ ఇండియా (కమ్యూనిస్టు) పార్టీ నుంచీ ఎల్.ఎన్.లక్ష్మి, ఇండిపెండెంట్‌గా కె.కాంతారావు, శ్రీకాళహస్తిలో నేషనలిస్ట్ జనశక్తి పార్టీ తరపున రమేష్, సత్యవేడులో ఇండిపెండెంట్ అభ్యర్థిగా జడ్డా రాజశేఖర్ నామినేషన్లు వేశారు.



తిరుపతి పార్లమెంటుకు కాంగ్రెస్ అభ్యర్థి చింతామోహన్ నామినేషన్



గూడూరు అసెంబ్లీకి టీడీపీ అభ్యర్థి సునీల్ నామినేషన్

కిక్కిరిసిన కుప్పం



కుప్పం వీధుల్లో పసుపు జెండాలతో టీడీపీ శ్రేణుల ర్యాలీ



నామినేషన్ ఫీజు కోసం భువనేశ్వరికి విరాళాలు ఇస్తున్న నిరుద్యోగులు

- చంద్రబాబు నామినేషన్ దాఖలుకు వెల్లువెత్తిన జనం

కుప్పం, ఏప్రిల్ 19 : కుప్పం జనసంద్రమైంది.టీడీపీ అధినేత చంద్రబాబు తరపున ఆయన సతీమణి నారా భువనేశ్వరి నామినేషన్ దాఖలు కార్యక్రమానికి వేలాదిగా తరలివచ్చిన పార్టీ శ్రేణులు, అభిమానులతో కుప్పం వీధులు కిక్కిరిశాయి.నియోజకవర్గంలోని నాలుగు మండలాల నుంచే కాకుండా చిత్తూరుతోపాటు ఇతర జిల్లాల నుంచి అభిమానులు వేలాదిగా కుప్పం తరలివచ్చారు. లక్ష్మీపురంలోని వరదరాజస్వామి ఆలయంలో ఉదయం 10.45 గంటలకు నామినేషన్ పత్రాలను స్వామివారి పాదాల చెంత ఉంచిన భువనేశ్వరి ఆయన విజయాన్ని ఆకాంక్షిస్తూ ప్రత్యేక పూజలు చేయించారు. అనంతరం మసీదు, చర్చిల్లో ప్రార్థనలు జరిపారు. ఆయా ప్రార్థనాలయాల్లో పూజారులు, మతపెద్దలు ఆమెకు ఆశీర్వచనం పలికి దీవించారు. అక్కడి నుంచి ఆమె కుప్పం చెరువుకట్ట వద్దకు ఉదయం 11.15 గంటల ప్రాంతంలో చేరుకున్నారు. అప్పటికే నియోజకవర్గంలోని టీడీపీ, బీజేపీ, జనసేన శ్రేణులు వేచి చూస్తున్నాయి. డప్పులు, కోలాటాలు, డీజే శబ్దాల మధ్య నామినేషన్ కేంద్రానికి భారీ ఊరేగింపు బయలుదేరింది. ఓపెన్ టాప్ వాహనం ఎక్కిన భువనేశ్వరి దారి పొడవునా ప్రజలకు, అభిమానులకు అభివాదం చేస్తూ, చిరునవ్వులు చిందిస్తూ ర్యాలీలో సాగారు. మిట్టమధ్యాహ్నం 12 గంటల వేళ ఎర్రడి ఎండ మాడ్చేస్తున్నా ఏమాత్రం లెక్కచేయని జనం ర్యాలీలో ఆమె వాహనం వెంట పరుగులు పెట్టారు. యువత కేరింతలు కొట్టారు. డ్యాన్సులు వేశారు. ఆర్టీసీ బస్టాండు కూడలి వద్దకు ర్యాలీ చేరుకునే సరికి మధ్యాహ్నం ఒంటి గంటయింది. ఇక్కడ భువనేశ్వరి ఎన్టీఆర్, అంబేడ్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి, నివాళులర్పించారు. పార్టీ శ్రేణులు, అభిమానులు, జన సమూహాన్ని ఉద్దేశించి 15 నిముషాలు ప్రసంగించారు. కుప్పం గడ్డ టీడీపీ అడ్డా అని, ఇక్కడ పసుపు జెండాకు తప్ప మరో జెండాకు స్థానం లేదని గర్జించారు. చంద్రబాబు సీఎం అయితేనే కుప్పంతోపాటు రాష్ట్ర భవిష్యత్తు బాగుంటుందని నమ్మడం వల్లే అన్ని వర్గాల ప్రజలు ఆయన నామినేషన్ ఫీజు సొమ్మును విరాళాలుగా అందించారని, కుప్పం ప్రజలకు ఎప్పుడూ రుణపడి ఉంటానని ప్రకటించారు.అనంతరం మధ్యాహ్నం 1.27 గంటలకు భువనేశ్వరి నామినేషన్ పత్రాలను రిటర్నింగ్ అధికారి జి.శ్రీనివాసులుకు అందించారు.నామినేషన్ కేంద్రానికి వంద మీటర్ల దూరంలోనే వాహనం నుంచి దిగి ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, టీడీపీ నియోకవర్గ ఇన్‌చార్జి పీఎస్.మునిరత్నం వెంటరాగా నామినేషన్ కార్యక్రమాన్ని పూర్తి చేశారు.

నామినేషన్ ఫీజుకు అభిమానుల విరాళాలు

చంద్రబాబు నామినేషన్ ఫీజుకు సంబంధించిన నగదు అభిమానుల నుంచి విరాళాలుగా సమకూరింది. ర్యాలీ ప్రారంభించడానికి ముందుగా భువనేశ్వరిని కలిసిన దివ్యాంగులు, మహిళలు, నిరుద్యోగులు, విద్యార్థులు నామినేషన్‌కు కావాల్సిన మొత్తాన్ని ఆమెకు విరాళంగా అందించారు. తమ భవిష్యత్తుకు చంద్రబాబు ద్వారానే భరోసా లభిస్తుందన్న నమ్మకంతో ఆయన గెలిచి తీరాలన్న ఆకాంక్షతో ఈ మొత్తం అందిస్తున్నట్లు ఈ సందర్భంగా వారు ఆమెతో చెప్పారు.



టీడీపీ శ్రేణులకు భువనేశ్వరి అభివాదం

పుత్తూరు బైపాస్‌లో పట్టుబడ్డ కర్ణాటక మద్యం

మున్సిపల్ వైస్ చైర్మన్ సమీప బంధువు అరెస్ట్

వైసీపీ నాయకులే డంప్ చేశారన్న అనుమానాలు

పుత్తూరు అర్బన్/నారాయణవనం, ఏప్రిల్ 19: నారాయణవనం మండల పరిధిలోని కల్యాణపురం వద్ద గురువారం రాత్రి భారీ మద్యం డంప్‌ను పోలీసులు సీజ్ చేశారు.సీఐ భాస్కర్ నాయక్ కథనం మేరకు...పుత్తూరు బైపాస్ రోడ్డులోని కల్యాణపురం వద్ద ఇద్దరు వ్యక్తులు ఆటోలో 46 మద్యం కేసులను తరలిస్తున్నట్లు ఎస్ఐ లక్ష్మీనారాయణ గుర్తించారు. విచారణలో స్థానికుడైన శివ లీజుకు తీసుకుని నడిపిస్తున్న ఎస్ఎస్ఎస్ వెయింగ్ మెషిన్ వద్ద 239 మద్యం కేసులు నిల్వ ఉంచి, అక్కడి నుంచి మరొక చోటకు తరలిస్తున్నట్లు తేలింది.మద్యాన్ని అక్కడ నిల్వ చేసిన సీఎస్ దిలీప్ ప్రస్తుతం పరారీలో ఉన్నాడని సీఐ తెలిపారు. దీంతో మొత్తం 285 మద్యం కేసులతో పాటు తిరునావక్కరసు, లీలాకృష్ణ, శివతో పాటు మద్యం తరలిస్తున్న ఆటోను సీజ్ చేసినట్లు సీఐ తెలిపారు.అయితే మద్యం డంప్ వ్యవహారంలో అన్ని వేళ్లూ అధికార పార్టీ వైపే చూపిస్తున్నాయి.మద్యం తరలిస్తుండగా అదుపులోకి తీసుకున్న వారిలో ఒకరు పుత్తూరు మున్సిపల్ వైస్ చైర్మన్ శంకర్ సమీప బంధువు తిరువనావక్కరసు కాగా మరొకరు ఆటో డ్రైవర్. వీరిని ప్రశ్నించిన పోలీసులకు వేబ్రిడ్జి గదిలో తరలించేందుకు సిద్ధంగా ఉన్న 239 కేసుల కర్ణాటక మద్యం గురించి తెలిసింది. ఇంత భారీస్థాయిలో మద్యం నిల్వ చేయడం వెనుక వైసీపీ నాయకుల హస్తం ఉందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. దీనికి తగ్గట్టుగానే పోలీసులు అరెస్ట్ చేసిన తిరువనాక్కరసు గేటు పుత్తూరులో వైసీపీ నాయకుడిగా ఉన్నారు.ఈయన బంధువు శంకర్ మున్సిపల్ వైస్ ఛైర్మన్‌గా కొనసాగుతున్నారు. పైగా పోలీసులు చెబుతున్నట్లు మద్యం డంప్ దొరికిన వేబ్రిడ్జి కూడా మరో వైసీపీ నాయకుడిదిగానే తెలుస్తోంది. కర్నాటక మద్యాన్ని ఎన్నికల కోసమే డంప్ చేసి ఉంచారనే ప్రచారం సాగుతోంది. ఇటీవల వైసీపీ నాయకులు నియోజకవర్గవ్యాప్తంగా మామిడి తోటల్లో విందు సమావేశాలు నిర్వహించారు. ఇందులో పాల్గొనే ప్రతి ఒక్కరికీ మద్యం సరఫరా చేసినట్లు ఆరోపణలున్నాయి. అలాగే ఎన్నికల ప్రచారానికి వచ్చే వారికి, సభలు, సమావేశాలకు హాజరయ్యే కార్యకర్తలకు మద్యం సరఫరా చేస్తున్నట్లు కూడా ప్రచారం జరుగుతోంది. షెడ్యూల్ విడుదలైనప్పటి నుంచి నియోజకవర్గంలో అధికార పార్టీ మద్యాన్ని ఏరులైపారిస్తోందనే ఆరోపణలూ వినిపిస్తున్నాయి. ఇతర రాష్ట్రాల నుంచి భారీ స్థాయిలో మద్యం దిగుమతి చేసుకుని ఆయా మండలాల్లో డంప్‌లను ఏర్పాటు చేసుకున్నట్లు కూడా సమాచారం. చీప్ లిక్కర్‌తో పాటు బ్రాండెడ్ మద్యాన్ని కూడా స్టాక్ చేసి ఉంచినట్లు తెలుస్తోంది. అయితే అధికార పార్టీ కావడంతో విషయం తెలిసినప్పటికీ ఎన్నికల అధికారులతో పాటు పోలీసులు సైతం అటు వైపు కన్నెత్తి చూడడం లేదనే మాటలు వినబడుతున్నాయి.కాబట్టే ఈ కేసులో సూత్రధారులను వదిలి చిన్న చేపల అరెస్ట్‌కే పోలీసులు పరిమితమైనట్లు ప్రచారం జరుగుతోంది.

మద్యం నిల్వలపై సమాచారమివ్వండి : సెబ్ ఏఎస్పీ

తిరుపతి(నేరవిభాగం), ఏప్రిల్ 19 : ఎన్నికల ప్రచారంలో పాల్గొనే కార్యకర్తలకు,కూలీలకు మద్యం పంచేందుకు వైసీపీ నాయకులు భారీ ఎత్తున మద్యాన్ని సేకరించి నిల్వ చేస్తున్నారు.ఈ నెల రోజుల వ్యవధిలో పట్టుబడిన మద్యం కేసుల్లో ఎక్కువ భాగం అధికార పార్టీ నాయకులకు సంబంధించిందే వుండడం ఇందుకు నిదర్శనం.ఎన్నికల కోడ్ వెలువడ్డాక నెల రోజుల వ్యవధిలోనే దాదాపు 7814లీటర్ల అక్రమ మద్యాన్ని సెబ్ అధికారులు సీజ్ చేసినట్లు అదనపు ఎస్పీ రాజేంద్ర చెప్పారు.మద్యం నిల్వలపై సమాచారం వుంటే 9154141861కు తెలియజేయాలని ఆయన సూచించారు.

చంద్రబాబు పర్యటనకు సర్వం సిద్ధం

తిరుపతి, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి):ఎన్నికల ప్రచారంలో భాగంగా టీడీపీ అధినేత చంద్రబాబు శనివారం ఉదయం 10.40 గంటలకు గూడూరు చేరుకుంటారు. అక్కడి సీఆర్ కళ్యాణ మండపంలో 11నుంచీ మధ్యాహ్నం ఒంటిగంట వరకూ మహిళలతో జరిగే ముఖాముఖీ సమావేశంలో పాల్గొంటారు. మధ్యాహ్న భోజనం గూడూరులోనే ముగించుకుని 2 గంటలకు నెల్లూరు జిల్లా సర్వేపల్లి నియోజకవర్గం పొదలకూరు వెళతారు. బహిరంగసభలో పాల్గొని సాయంత్రం 5.30 గంటలకు సత్యవేడు చేరుకుంటారు.6 నుంచీ 7.30 గంటల వరకూ క్లాక్ టవర్ కూడలిలో జరిగే ప్రజాగళం సభలో పాల్గొంటారు.అనంతరం తిరుపతికి చేరుకుని రాత్రి బస చేస్తారు.ఎన్నికల వేళ అధినేత పర్యటనను విజయవంతం చేయాలని పార్టీ అభ్యర్థులు, ముఖ్యనేతలు గట్టిగా ప్రయత్నిస్తున్నారు.అందులో భాగంగా భారీగా ఏర్పాట్లు చేస్తున్నారు.

ఏమిటిది భూమనా?

అభినయ్ ఆస్తులపై నగరంలో చర్చ

- టీటీడీ ఉద్యోగులకు ఇచ్చిన స్థలాల చుట్టూనే 6 ఎకరాలు
- తుడా చైర్మన్‌గా, టీటీడీ చైర్మన్‌గా ఉన్నపుడే కొనుగోళ్లు

తిరుపతి, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి):తిరుపతి వైసీపీ అభ్యర్థి, టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి కుమారుడు అయిన అభినయ్ రెడ్డి భూములన్నీ టీటీడీ ఉద్యోగులకు ఇచ్చిన ఇంటి స్థలాల చుట్టూనే వుండడంపై నగరంలో చర్చ జరుగుతోంది. మరొక విశేషం ఏమిటంటే.. కరుణాకర్ రెడ్డి తుడా ఛైర్మన్‌గా ఉన్న సమయం (2005-06)లోనూ, టీటీడీ చైర్మన్‌గా పదవిలో ఉన్నపుడే అభినయ్ రెడ్డి పేరిట 21 సార్లు ఆస్తుల కొనుగోళ్లు జరగడం.కరుణాకరరెడ్డి టీటీడీ చైర్మన్ అయ్యాక (2007-08)లో మూడు సార్లు కొనుగోలు చేశారు. వడమాల పేట మండలం ఎస్వీపురం వద్ద 5.84 ఎకరాలు (ప్రస్తుతం టీటీడీ ఉద్యోగులకు ఇంటిస్థలాలు ఇచ్చిన ప్రాంతం), సూరప్పకశం టౌన్‌షిప్ సమీపంలోని గాజులమండ్యంలో 13.82 ఎకరాలు కలిపి మొత్తంగా 19.66 ఎకరాల భూమిని తుడా ఛైర్మన్‌గా ఉన్నప్పుడే కుమారుడి పేరిట కొన్నారు. 2008లో తిరుపతి రూరల్ మండలం కొత్తూరు దగ్గర 1.37 ఎకరాల స్థలం అభినయ్ పేరిట కొనుగోలు జరిగింది. తిరుచానూరు గ్రామ లెక్కదాఖలాలో రెండెకరాలు (సర్వే నెంబరు 473/4) 2021లో కరోనా సమయంలో కొన్నారు. ప్రస్తుతం ఎమ్మెల్యే నివాసం ఉంటున్న పద్మావతిపురంలో 2011లోనే నాలుగు చోట్ల రెసిడెన్షియల్ ఆస్తులను కొనుగోలు చేశారు. 2008లో హైదరాబాదులో 2225 చదరపు అడుగులు కలిగిన ఓ రెసిడెన్షియల్ బిల్డింగ్ అభినయ్ ఆస్తుల ఖాతాలో ఉంది. ఇక భార్య పేరిట 2011లో (సెజ్ సమీపంలో) వరదయ్యపాళం, పాండూరు దగ్గర 28 ఎకరాల భూమి గిఫ్ట్ డీడ్ రూపంలో వచ్చింది.

టీటీడీ ఉద్యోగుల ఇళ్ల స్థలాల మర్మమిదేనా?

తిరుపతికి 22 కిలోమీటర్ల దూరంలో వడమాలపేట మండలం పాదిరేడు అరణ్యం దగ్గర టీటీడీ ఉద్యోగులకు ఇళ్ల స్థలాలు కేటాయించిన సంగతి తెలిసిందే. దీని సమీపంలోనే అభినయ్ పేరిట దాదాపు ఆరెకరాల భూములున్నాయి. టీటీడీ చైర్మన్ కరుణాకర రెడ్డి తన కుమారుడి ఆస్తుల విలువ పెంచుకునేందుకే ఇక్కడ టీటీడీ ఉద్యోగులకు స్థలాలను ఎంపిక చేశారన్న విపక్షాల వాదన నిజమేనని అఫిడవిట్ బయటపెడుతోందని జనం అంటున్నారు. రిజిస్ట్రేషన్ శాఖ లెక్కల ప్రకారం ఈ భూముల్లో హైవేకి ఆనుకుని ఉన్న భాగంలో ఎకరం విలువ రూ1.50కోట్లు కాగా, లోపలి ప్రాంతంలో రూ87.12లక్షలు. మార్కెట్ విలువ ఇంతకంటే నాలుగు రెట్లు ఎక్కువవుంటుంది. అభినయ్ పేరిట రూ4.62 కోట్ల విలువైన చరాస్తులు, రూ17.05 కోట్ల విలువైన స్థిరాస్తులు ఉండగా, ఆయన భార్య పేరిట రూ25.18 కోట్ల ఆస్తులు, రూ3.59కోట్ల విలువైన నగలు ఉన్నాయి. రూ86,09,751 అప్పులు, నగదు రూపంలో చేతిలో రూ.80 వేలు, భార్య దగ్గర రూ.50వేలు నగదు ఉన్నట్టు అఫిడవిట్‌లో చూపించారు.

కోట్ల ఆస్తులు ఎలా వచ్చాయబ్బా?

కరుణాకర రెడ్డికి ఫుల్‌టైం రాజకీయాలు తప్ప వ్యాపారాలు చేసినట్టు (ముప్పై ఏళ్లక్రితం ట్రావెల్స్, సిద్ధార్థ జిరాక్స్ తప్ప) ఎక్కడా ఆనవాళ్లు లేవు. అభినయ్ రెడ్డి కూడా తండ్రి బాటలోనే ఉన్నారు. అఫిడవిట్‌లో మాత్రం మ్యూచువల్ ఫండ్స్‌లో పెట్టుబడులు, కొన్ని ప్రైవేట్ కంపెనీల్లో షేర్లు కొన్నట్టు ఉంది. మరి ఇన్ని ఆస్తులు వీరికి ఎలా వచ్చాయనే చర్చ తిరుపతి జనంలో జోరుగా సాగుతోంది.

చింతా మోహన్‌కు ఆస్తి నిల్

తిరుపతి, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): ఆరు సార్లు పార్లమెంటు సభ్యుడు. అందులో ఓ పర్యాయం కేంద్ర మంత్రి. తాజాగా పదకొండో సారి ఎంపీగా నామినేషన్ దాఖలు చేశారు డాక్టర్ చింతా మోహన్. శుక్రవారం ఆయన సమర్పించిన అఫిడవిట్‌లో ఆస్తి విలువ సున్నా. బ్యాంకు బ్యాలెన్స్ కూడా రూ.2వేల లోపే. చేతిలో మాత్రం రూ.40వేలు ఉన్నట్టు చూపించారు. స్థిరాస్తి సెంటు భూమి కూడా లేదని వెల్లడించారు. భార్య పేరుతో మాత్రం తిరుపతి రామచంద్ర నగర్‌లో ఓ ఇల్లు, దాని సమీపంలో రూ1.40కోట్ల స్థలం ఉన్నట్టు చూపించారు.

ఏమ్మా.. చెప్తా ఉండేది నీకే..!

- అన్న చెప్పినాడు.. రాజీనామా అంట చేయ్
- లేదంటే ఇబ్బందులు పడతావ్.. ఇంక నీ ఇష్టం
- చంద్రగిరిలో వలంటీర్లకు బెదిరింపులు

తిరుచానూరు, ఏప్రిల్ 19: ఏమ్మా రెండ్రోజులుగా ఫోన్ చేస్తావుంటే నువ్వు స్విచ్ ఆఫ్ చేసుకుంటే ఎట్లా.. పొద్దుగూకులు మీ ఇంటికాడికే ఏడ వచ్చేది? ఎన్నిసార్లు అడుక్కోవాలి? అన్న చెప్పినాడు, ఇంద ఈ రూ.10వేలు తీసుకుని రాజీనామా అంటచేయ్, సరేనా.. చెప్తా ఉండేది నీకే..! లేదంటే వచ్చేది మళ్లీ మన ప్రభుత్వమే.. ఇబ్బందులు పడుతావ్ నీ ఇష్టం.. ఇదీ చంద్రగిరి నియోజకవర్గంలో వలంటీర్లకు వారం రోజులుగా వైసీపీ నేతల నుంచి వస్తున్న బెదిరింపులు. నియోజకవర్గంలోని ప్రజాప్రతినిధి ఆదేశాలతో గ్రామాల్లో ఉన్న వైసీపీ సర్పంచులు, వారి అనుచరులు వలంటీర్ల ఇళ్ల వద్దకే రాజీనామా దరఖాస్తు తీసుకెళ్లి వారే పూరించి, సంతకం పెట్టమని వలంటీర్లను ఇబ్బందులకు గురి చేస్తున్నారు. మరోవైపు నియోజకవర్గంలో అనధికారంగా సుమారు 1,500మంది వలంటీర్ల రాజీనామా పత్రాలను వైసీపీ నేతలు తీసుకెళ్లి ఎంపీడీవో వద్దకు చేర్చారన్న ఆరోపణలూ వ్యక్తమవుతున్నాయి.

టీడీపీలో చేరినవారికి
వైసీపీ బెదిరింపులు


జరిగిన సంఘటనను సీఐకి వివరిస్తున్న సురేష్‌రెడ్డి

చంద్రగిరి, ఏప్రిల్ 19: చంద్రగిరి మండలం, రాయలపురంలో శుక్రవారం రాత్రి గ్రామస్తులు కొంతమంది టీడీపీలో చేరారు. అయితే టీడీపీ సభ జరుగుతుండగా కొంతమంది ఆకతాయిలు సభలోకి వచ్చి గందరగోళం చేయడానికి ప్రయత్నించారు. ఈ క్రమంలో టీడీపీ నాయకుడు ముడిపల్లి సురేష్‌రెడ్డి మాట్లాడాలంటూ రాయలపురంలోని వైసీపీ కార్యకర్త అబ్బులుకు ఫోన్ చేశారు. దీంతో అబ్బులు వైసీపీ నాయకుడు కుప్పిరెడ్డి భాస్కర రెడ్డికి సమాచారం అందించాడు. తరువాత సురేష్‌రెడ్డికి ఫోన్ చేసి అవసరమైతే నీకే రూ.15 లక్షలు ఇస్తాం,వైసీపీలోకి రావాలంటూ హేళనగా మాట్లాడాడు.అతడి పక్కనున్న భాస్కర రెడ్డి ఫోన్ తీసుకుని సురేష్‌రెడ్డిని అసభ్యపదజాలంతో దూషించాడు.ఈ విషయం తెలియగానే టీడీపీ శ్రేణులు సుమారు వంద మంది జాతీయ రహదారి వద్దకు చేరుకున్నారు.ఈ విషయం తెలిసి వైసీపీ నాయకులు కూడా అక్కడకు చేరుకోవడంతో ఉద్రిక్తత నెలకొంది.ఈ విషయం తెలిసి పోలీసులు వచ్చి సర్దిచెప్పడంతో పరిస్థితి సద్దుమణిగింది.

హోటల్ ఫ్లెక్సీని చించారని గొడవ
ఇద్దరికి గాయాలు


గాయపడ్డ రియాజ్, రాజు

చంద్రగిరి, ఏప్రిల్19: చంద్రగిరి మండలం, ఎ.రంగంపేటలో శుక్రవారం రాత్రి ఇరువర్గాల మధ్య ఫ్లెక్సీని చించారనే వివాదం తలెత్తింది. ఈ గొడవలో ఇద్దరికి గాయాలయ్యాయి. పోలీసుల కథనం మేరకు.... ఎ.రంగంపేటలో ప్రభాకర్‌యాదవ్ రెండు రోజుల క్రితం హోటల్‌ను ప్రారంభించాడు.అక్కడ ఓ ఫ్లెక్సీని ఏర్పాటు చేయగా దాన్ని కొంతమంది చించారని తెలియడంతో మాట్లాడడానికి ప్రభాకర్‌యాదవ్ కుమారుడు రాజు నారావారిపల్లెకు చెందిన చైతన్యను పిలిపించాడు. ఫ్లెక్సీ చింపివేత విషయమై ఇద్దరి మధ్య గొడవ జరగడంతో చైతన్య అనుచరులు సంతోష్‌రెడ్డి తదితరులు రాజు స్నేహితుడు రియాజ్‌పై కత్తితో దాడి చేశారు.అనంతరం రాజు ఇంటికి చైతన్య, అతని అనుచరులు వెళ్లి వస్తువులను ధ్వంసం చేసి, రాజుపై దాడి చేయడంతో అతడి కాలికి గాయమైంది. సమాచారం అందుకున్న చంద్రగిరి డీఎస్పీ శరత్, సీఐ రామయ్య సిబ్బందితో వెళ్ళి ఇరువర్గాలను చెదరగొట్టారు. రియాజ్‌ను,రాజును తిరుపతి రుయాస్పత్రికి తరలించారు.

వేమిరెడ్డికి సన్మానం



చంద్రగిరి, ఏప్రిల్ 19: నెల్లూరు పార్లమెంటు టీడీపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిని కేజీకే అధినేత ప్రాపర్టీస్ అధినేత కుప్పాల గిరిధర్‌కుమార్ సన్మానించారు. వేమిరెడ్డి జన్మదినం సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు.

తిరుమలేశుడి సేవలో ప్రముఖులు


ఎస్బీఐ బోర్డు సభ్యులు

తిరుమల, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని శుక్రవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. నెల్లూరు పార్లమెంట్ కూటమి అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కోవూరు ఎమ్మెల్యే అభ్యర్థి వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి దంపతులు కుటుంబ సభ్యులతో కలిసి శ్రీవారిని దర్శించుకున్నారు. తెలంగాణ సీఎస్ శాంతికుమారి, ఎస్బీఐ ఆడిట్ కమిటీ ఆఫ్ బోర్డు సభ్యులు స్వామిని దర్శించుకున్నారు.

సోనియాగాంధీ కాళ్లే పట్టుకోలేదు..
నీకాళ్లు పట్టుకుంటానా..?
-మాజీ సీఎం కిరణ్ వాఖ్యలపై మంత్రి పెద్దిరెడ్డి ఆగ్రహం

పుంగనూరు, ఏప్రిల్ 19: 'పదవుల కోసం కాంగ్రెస్ అగ్రనేత సోనియా గాంధీ కాళ్లే పట్టుకోలేదు, ఇక నీ కాళ్లు పట్టుకొనే దుస్థితి నాకు రాలేదు' అని మాజీ సీఎం నల్లారి కిరణ్‌కుమార్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను ఖండిస్తూ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు.శుక్రవారం పుంగనూరులో వైసీపీ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు సందర్భంగా ఆయన మాట్లాడుతూ కిరణ్ కుట్రలు చేసి చిదంబరం కాళ్లు పట్టుకుని పదవి పొందారని ఆరోపించారు. పుట్టపర్తిలో సత్యసాయిబాబా చనిపోతే శవాన్ని 10 రోజులు అడ్డుపెట్టుకుని బంగారాన్ని లారీల్లో బెంగళూరుకు తరలించి కిరణ్‌కుమార్‌రెడ్డి, చిదంబరం భాగాలు పంచుకున్నారని ఆరోపించారు.


తిరుచానూరు దామినేడు సమీపంలోని అక్షర ఎంబీఏ కళాశాలలో మ్యాజిక్ బస్ ఇండియా ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన మెగా జాబ్ మేళాలో ప్రముఖ కంపెనీలకు ఎంపికైన 112 మంది విద్యార్థులతో ప్రిన్సిపాల్ కొండారెడ్డి, డైరెక్టర్లు రాజారెడ్డి, శ్రీరాములు, రెడ్డిప్రసాద్ తదితరులు

రైలు డ్రైవర్లకు కుటుంబీకుల
సహకారం అవసరం
రైల్వే బోర్డు అదనపు సభ్యుడు విజయ ప్రతాప్ సింగ్


తనిఖీలు నిర్వహిస్తున్న వి.పి.సింగ్

తిరుపతి సెంట్రల్, ఏప్రిల్ 19: రైలు నడిపే డ్రైవర్లకు కుటుంబ సభ్యుల సహకారం అవసరమని రైల్వే బోర్డు అదనపు సభ్యుడు (ట్రాక్షన్) విజయ ప్రతాప్ సింగ్ అన్నారు. శుక్రవారం తిరుపతి రైల్వేస్టేషన్‌లో తనిఖీలు నిర్వహించారు. అనంతరం వీఐపీ లాంజ్‌లో డ్రైవర్లు, వారి కుటుంబ సభ్యులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఒక రైలులో 1200 మందికి పైగా ప్రయాణికులు ఇద్దరు డ్రైవర్లపై ఆధారపడి ప్రయాణిస్తారన్నారు. విధి నిర్వహణలో వారు చిన్న పొరపాటు చేసినా భారీ ప్రాణ నష్టం జరిగే అవకాశం ఉందని చెప్పారు. ప్రమాదాలు జరుగకుండా డ్రైవర్లు తీసుకోవలసిన పలు అంశాలను సూచించారు. స్థానిక అధికారులు పాల్గొన్నారు.

రేపు మోడల్ స్కూల్స్ ప్రవేశ పరీక్ష

తిరుపతి(విద్య), ఏప్రిల్ 19: మోడల్స్ స్కూల్స్‌లో 6వ తరగతిలో చేరేందుకుగాను ప్రవేశ పరీక్ష ఆదివారం జరుగనుందని జిల్లా విద్యాశాఖాధికారి వి.శేఖర్ తెలిపారు. జిల్లాలోని ఐదు మండలాల్లో ఐదు మోడల్ పాఠశాలలు ఉన్నాయన్నారు. ఒక్కో పాఠశాలలో వంద చొప్పున 500 సీట్లు ఉన్నాయని వివరించారు. 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి ప్రవేశాలకు ఈపరీక్ష నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

ఎర్రావారిపాలెం: హాల్‌టిక్కెట్‌లను మోడల్ స్కూల్ వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చని ఎర్రావారిపాలెం స్కూల్ ప్రిన్సిపాల్ శ్రీదేవి తెలిపారు. హాల్ టిక్కెట్‌లు పొందలేని విద్యార్థులు ఆదివారం ఉదయం ఎనిమిదిగంటలకు తమస్కూల్‌లో ఏర్పాటు చేసిన హెల్ప్ డెస్క్ వద్దకొస్తే డౌన్‌లోడ్ చేసి ఇస్తామని పేర్కొన్నారు.

అమ్మవారి ఆలయంలో పరిచారకుడి దాష్టీకం

- భక్తురాలితో అసభ్య ప్రవర్తన
- ఆలస్యంగా వెలుగులోకి
- గతంలోనూ ఇదే తంతు

తిరుచానూరు, ఏప్రిల్ 19: తిరుచానూరు పద్మావతి అమ్మవారి ఆలయంలో ఓ పరిచారకుడి దాష్టీకం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఐదు రోజుల క్రితం తమిళనాడుకు చెందిన ఓ కుటుంబం అమ్మవారి దర్శనానికి వచ్చింది. వీరు దర్శనానంతరం అమ్మవారి తీర్థం, శఠారి కోసం వెళ్లారు. చివర్లో వస్తున్న ఆ కుటుంబానికి చెందిన ఓ మహిళ తలపై శఠారీ పెడుతూ.. అసభ్యంగా ప్రవర్తించాడు. ఈ విషయాన్ని బాధితురాలు కన్నీరుపెడుతూ కుటుంబీకులు తెలిపింది. వారు అక్కడ విధి నిర్వహణలో ఉన్న అధికారికి ఫిర్యాదు చేశారు. దీన్ని గమనించిన పరిచారకుడు కూడా వచ్చి బాధిత కుటుంబీకులతో బెదిరింపు ధోరణితో మాట్లాడటమే కాకుండా వాగ్వాదానికి దిగాడు. దాంతో బాధితురాలు జరిగిన విషయాన్ని ఆలయ అధికారులకు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేసింది. ఈ విషయాన్ని ఆలయాధికారులు గోప్యంగా ఉంచడంపై విమర్శలొస్తున్నాయి. గతంలోనూ ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని ఓ ఆలయంలోనూ భక్తురాలిపై ఇదే పరిచారకుడు అసభ్యంగా ప్రవర్తిస్తే ఆమె కుటుంబీకులు చితకబాదారని సమాచారం. అలాంటి పరిచారకుడికి తిరుపతికి చెందిన ఓ వైసీపీ ప్రజాప్రతినిధి, టీటీడీ బోర్డులో ఉన్న వ్యక్తి సిఫార్సుతో మూడు నెలల క్రితం అమ్మవారి ఆలయంలో బాధ్యతలు చేపట్టినట్లు తెలుస్తోంది. ఈ సంఘటనపై ఆలయ అధికారులను వివరణ కోరగా.. పరిచారకుడిపై చర్యలు తీసుకుంటున్నామని, అతడిని ఆలయంలోకి రానీయడం లేదని చెప్పారు.

పది ఆర్వో ప్లాంట్ల సామగ్రి సీజ్


స్వాధీనం చేసుకున్న ఆర్వో ప్లాంట్ల సామగ్రి, వివరాలు తెలియజేస్తున్న ఎన్నికల అధికారులు

పాకాల, ఏప్రిల్ 19: పది ఆర్వో ప్లాంట్లకు సంబంధించిన సామగ్రిని శుక్రవారం సీజ్ చేశారు. పాకాల మండలంలోని నేంద్రగుంట నుంచి ఆర్వో ప్లాంట్ల సామగ్రిని పంపిణీ చేస్తుండటంతో టీడీపీ నాయకులు ఎన్నికల అధికారులకు ఫిర్యాదు చేశారు. కోడ్ అమలులో ఉండగా వైసీపీ నాయకులు ఎన్నికల్లో ప్రయోజనం పొందడానికి ప్రయత్నిస్తున్నారని వారు ఆరోపించారు. రెండు కంటైనర్లలో వచ్చిన సామగ్రిని అప్పటికే రెండు, మూడు ట్రాక్టర్లలో తరలించేశారని చెప్పారు. టీడీపీ నేతల ఫిర్యాదుతో తహసీల్దార్ వాణిశ్రీ, ఎంపీడీవో నాగేంద్రబాబు, సీఐ రాజగోపాల్ కంటైనర్లవద్దకు చేరుకున్నారు. కంటైనర్లలో వచ్చిన సామగ్రిని సీజ్ చేస్తున్నట్లు ప్రకటించారు. అప్పటికే ట్రాక్టర్లలో తరలివెళ్లిన వాటిని కూడా వెనక్కి రప్పించి పది ఆర్వో ప్లాంట్ల సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు.మొత్తం సామగ్రిని పోలీసులకు అప్పగిస్తున్నట్లు, కమర్షియల్ ట్యాక్స్ డిపార్ట్‌మెంట్ అధికారులకు సమాచారం అందిస్తామన్నారు. నిబంధనల మేరకు ఉంటే ఎన్నికల తర్వాత రిలీజ్ చేస్తామని లేకుంటే కోర్టుకు అప్పగిస్తామన్నారు. హైదరాబాదుకు సంబంధించిన కాంట్రాక్టర్ ఈ మెటీరియల్ సరఫరా చేసినట్లు అధికారులు తెలిపారు.

ఎన్డీయే అభ్యర్థులను గెలిపించండి

- ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ పిలుపు


సమావేశంలో ప్రసంగిస్తున్న మంద కృష్ణ మాదిగ

చంద్రగిరి, ఏప్రిల్ 19: మాదిగలు ఏకతాటిపై నిలబడి ఎన్డీయే అభ్యర్థులను గెలిపించాలని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ పిలుపునిచ్చారు. శుక్రవారం చంద్రగిరిలో ఎమ్మార్పీఎస్ నాయకులు, కార్యకర్తల సమావేశానికి తిరుపతి బీజేపీ ఎంపీ అభ్యర్థి వరప్రసాద్‌తో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా మందకృష్ణ మాట్లాడుతూ.. నవంబరులో జరిగిన మాదిగల విశ్వమహాసభకు ముఖ్య అతిథిగా ప్రధాని మోదీ హాజరై, ఎస్సీ వర్గీకరణకు కట్టుబడి ఉన్నామని చెప్పారన్నారు. అందులో భాగంగానే ఎన్డీయే కూటమికి రాష్ట్రంలో ఎమ్మార్పీఎస్ మద్దతు ఇవ్వడం జరిగిందన్నారు. వరప్రసాద్ మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణకు బీజేపీ కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. మాదిగలు ఐక్యతతో కూటమి అభ్యర్థులను గెలిపించాలని కోరారు. ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు వేలూరు రాజేంద్ర, రాష్ట్ర అధికార ప్రతినిధి రామకృష్ణ మాదిగ, ఉపాధ్యక్షుడు సూరిపాక వాసు మాదిగ, తిరుపతి సీనియర్ నేత పులికుంట్ల గోపి మాదిగ, చిత్తూరు, నెల్లూరు జిల్లాల అధ్యక్షులు ప్రకాష్ మాదిగ, ఉదయ కృష్ణ మాదిగ, పలువురు నాయకులు పాల్గొన్నారు.

పటిష్ఠ ప్రణాళికతోనే ఉన్నత భవిష్యత్తు
- పద్మావతి వర్సిటీ మాజీ వీసీ సరోజమ్మ


సభలో పాల్గొన్న సరోజమ్మ, భారతి, రజని తదితరులు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఏప్రిల్ 19: పటిష్ఠ ప్రణాళికను అనుసరించడం ద్వారా విద్యార్థులు ఉన్నత భవిష్యత్తును పొందవచ్చని పద్మావతి మహిళా యూనివర్సిటీ మాజీ వీసీ సరోజమ్మ తెలిపారు. ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో శుక్రవారం వర్సిటీలో నిర్వహించిన ఇంటరాక్టివ్ సెషన్‌లో ఆమె మాట్లాడుతూ.. చదువుతోపాటు క్షేత్ర సందర్శనతో అదనపు అవగాహన ఏర్పడుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో వీసీ భారతి, రిజిస్ట్రార్ రజని, ఎన్ఎస్ఎస్ అధికారులు డాక్టర్ యువశ్రీ, విద్యార్థులు పాల్గొన్నారు.

చెవిరెడ్డిది రాచరిక పాలన

- చంద్రగిరి టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పులివర్తి నాని


పులివర్తి నాని సమక్షంలో టీడీపీలో చేరుతున్న వైసీపీ నేతలు, వేదాంతపురంలో ప్రచారం చేస్తున్న పులివర్తినాని

తిరుపతి రూరల్, ఏప్రిల్ 19: చంద్రగిరి నియోజకవర్గంలో ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కరరెడ్డి రాచరిక పాలన సాగిస్తున్నారని టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పులివర్తి నాని మండిపడ్డారు. తిరుపతి రూరల్ మండలంలోని వేదాంతపురం పంచాయతీలో శుక్రవారం మీ ఇంటివద్దకు మీ పులివర్తి నాని, బాబు ష్యూరిటీ.. భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నాని మాట్లాడుతూ.. ప్రజాసేవ చేసేందుకు రాజకీయాల్లోకి వచ్చానని చెప్పుకునే చెవిరెడ్డి తన స్వార్థం, స్వలాభం కోసం ఎమ్మెల్యే పదవిని ఉపయోగించారని విమర్శించారు. ఆయనచేసేది రాజకీయ వ్యాపారమని ఆగ్రహించారు. నాలుగు పదవులను అడ్డం పెట్టుకుని రూ.5వేల కోట్ల ప్రజాధనాన్ని, ప్రకృతి సంపదని దోచేశారని చెప్పారు. ప్రజలు ఇవన్నీ గమనిస్తున్నారని, ఈసారి ఎన్నికల్లో తమ ఓటుతో బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే వలంటీర్లకు రూ.10వేల గౌరవ వేతనం అందిస్తుందని, ఎవరూ చెవిరెడ్డి మాటలు విని రాజీనామా చేయొద్దని కోరారు. రూరల్ మండల టీడీపీ అధ్యక్షుడు ఎ.ఈశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రజకుల సమస్యలు పరిష్కరిస్తా: ఎల్ఎస్‌నగర్‌లో నిర్వహించిన ఏపీ రజక వృత్తిదార్ల సంఘ సమావేశంలో నాని మాట్లాడుతూ.. టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే రజకుల సమస్యలను పరిష్కరిస్తామని, తమకు మద్దతు ఇవ్వాలని కోరారు.

తిరుపతి రూరల్‌లో వైసీపీ షాక్

తిరుచానూరు: తిరుపతి రూరల్ మండలంలో పలువురు వైసీపీ నాయకులు ఆ పార్టీకి షాక్ ఇస్తూ టీడీపీలోకి క్యూ కడుతున్నారు. శుక్రవారం వేదాంతపురంలో చంద్రగిరి టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పులివర్తి నాని సమక్షంలో వైసీపీ నేతలు రవిరెడ్డి, తిరుపాల్‌రెడ్డి, కృష్ణమూర్తిరెడ్డి, కుమార్‌రెడ్డి, చిన్న, ప్రదీప్‌రెడ్డి, రంగనాథం, మధు, రెడ్డెప్ప, రఘురామరెడ్డి, కన్నెప్ప తదితరులతోపాటు పేరూరుకు చెందిన పలువురు కూడా తెలుగుదేశం పార్టీలో చేరారు. పులివర్తి నాని గెలుపు కోసం కృషి చేస్తామని తెలిపారు. నేతలు పులిగోరు మురళి, జేబీ శ్రీనివాస్, ఈశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చంద్రగిరి అభివృద్ధి బాధ్యత నానీదే: వినీల్


శ్రీనివాసపురంలో వినీల్ ప్రచారం

తిరుపతి రూరల్, ఏప్రిల్ 19: చంద్రగిరి నియోజకవర్గం బాధ్యత పులివర్తి నాని తీసుకుంటారని ఆయన తనయుడు పులివర్తి వినీల్ స్పష్టం చేశారు. తిరుపతి రూరల్ మండలంలో శ్రీనివాసపురం పంచాయతీ పరిధిలోని టెలిఫోన్‌కాలనీలో శుక్రవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. వినీల్ మాట్లాడుతూ.. ఈసారి జరిగే ఎన్నికల్లో తన తండ్రికి ఒక్క అవకాశం ఇస్తే అభివృద్ధిని కళ్లముందు చూపిస్తారని చెప్పారు.

మరోదఫా చెవిరెడ్డి ట్రాప్‌లో పడొద్దు


పేరూరులో మాట్లాడుతున్న పులివర్తి సుధారెడ్డి

తిరుపతి రూరల్, ఏప్రిల్ 19: చంద్రగిరి నియోజకవర్గ ప్రజలు మరోసారి ఎమ్మెల్యే చెవిరెడ్డి ట్రాప్‌లో పడి మోసపోవద్దని టీడీపీ మహిళానేత పులివర్తి సుధారెడ్డి అన్నారు. తిరుపతి రూరల్ మండలంలో పేరూరు పంచాయతీ పరిధిలోని జనార్దన్ నగర్‌లో శుక్రవారం మహిళలతో మహిళా శక్తికి అండగా కార్యక్రమాన్ని నిర్వహించారు. పేదల కడుపు కొట్టే వైసీపీ పాలకులకు ఈసారి ఎన్నికల్లో తమ ఓటు ద్వారా బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు.

టీడీపీతోనే రైతుల కష్టాలు దూరం

ఎర్రావారిపాలెం, ఏప్రిల్ 19: టీడీపీ ప్రభుత్వంతోనే రైతుల కష్టాలు దూరమవుతాయని ఆ పార్టీ మండల అధ్యక్షుడు దేశిరెడ్డి రఘునాథ పేర్కొన్నారు. మండలంలోని నెరబైలు తదితర గ్రామాల్లో శుక్రవారం టీడీపీ శ్రేణులు ఇంటింటి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా సూపర్ సిక్స్ పథకాల గురించి ప్రజలకు వివరించారు. రఘునాథ మాట్లాడుతూ టీడీపీ అభ్యర్థి పులివర్తి నానీని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ప్రజలను కోరారు. మామిడి పంటకు గిట్టుబాటు ధర కల్పించనున్నట్లు నానీ హామీ ఇచ్చారని చెప్పారు. మండల పార్టీ ప్రధాన కార్యదర్శి మహేష్ నాయుడు, కేశవులు నాయుడు, సురేంద్ర బాబు, విజయరెడ్డి, చలపతి, మురళి, నాగరాజ, అశోక్ రెడ్డి, విశ్వనాథరెడ్డి, వెంకట శివరామిరెడ్డి, దేవి, సుధాకర్ నాయక్, వేణు, రమాణారెడ్డి పాల్గొన్నారు.

బెస్తపల్లెలో వేడుకగా కావమ్మ తిరుణాళ్ల


ముస్తాబైన కావమ్మ మారయ్య ఆలయం

ఎర్రావారిపలెం, ఏప్రిల్ 19: ఎర్రావారిపాలెం పంచాయతీలోని బెస్తపల్లెలో కావమ్మ మారయ్య తిరుణాళ్ల శుక్రవారం వేడుకగా ప్రారంభమైంది. మూడు రోజుల పాటు జరిగే తిరుణాళ్లలో బెస్త కులస్తులతో పాటు గ్రామస్తులందరూ పాల్గొని భక్తి శ్రద్ధలతో అమ్మవారిని కొలుస్తారు. శుక్రవారం పూజ, అభిషేకం, ఆరాధన నిర్వహించారు. రాత్రి చెక్కభజన, కోలాటం, కావమ్మ జీవిత చరిత్ర బుర్రకథ జరిగింది. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

పిల్లలను ప్రభుత్వ బడుల్లో చేర్పించండి: ఎంఈవో



పాకాల, ఏప్రిల్ 19: ఇరంగారిపల్లె మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల వార్షికోత్సవ వేడుకలు శుక్రవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎంఈవో బాబ్జీ మాట్లాడుతూ.. అన్ని మౌలిక వసతులతోపాటు అంకితభావంతో పనిచేసే ఉపాధ్యాయులు ప్రభుత్వ పాఠశాలల్లో ఉన్నారని చెప్పారు. తల్లిదండ్రులు పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని కోరారు. మాజీ సర్పంచ్ ఇరుగు నాగరాజ, ప్రధానోపాధ్యాయురాలు శ్రీరంజని, విశ్రాంత హెడ్‌మాస్టర్ అరుళ్ సెల్వి, టీచర్లు శ్రీధర్ రెడ్డి, తులసి, జ్యోతి, నాగసరిత పాల్గొన్నారు.

పాఠశాల వార్షికోత్సవం



ఎర్రావారిపాలెం, ఏప్రిల్ 19: కలికిరి వాండ్లపల్లి ప్రాథమిక పాఠశాల వార్షికోత్సవం శుక్రవారం ఘనంగా జరిగింది. హెచ్ఎంరెడ్డి లావణ్య ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ప్రతిభ చూపిన విద్యార్థులకు ఎంఈవో సతీష్, తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ నాగరత్న బహుమతులు అందజేశారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వైభవంగా స్నపన తిరుమంజనం

చంద్రగిరి, ఏప్రిల్ 19: కోదండరామస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం సీతారామలక్ష్మణ ఉత్సవర్లకు స్నపన తిరుమంజనం వైభవంగా నిర్వహించారు. సాయంత్రం స్వామి, అమ్మవారి ఉత్సవర్లను ఉయ్యాల మండపంలో అధిష్ఠింపజేసి వివిధ రకాల పుష్పాలతో అలంకరించి, కన్నులపండువగా ఊంజల్ సేవ నిర్వహించారు. ఆలయ సూపరింటెండెంట్ శ్రీనివాస్‌రావు, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ ముని హరిబాబు, అర్చకుడు శ్రీనివాస భట్టర్, సిబ్బంది పాల్గొన్నారు.

అభ్యర్థుల ఖర్చుల రికార్డులు పక్కాగా నిర్వహించాలి


అధికారులతో సమీక్షిస్తున్న ప్రదీప్‌కుమార్ తదితరులు

తిరుపతి(కలెక్టరేట్), ఏప్రిల్ 19: అభ్యర్థుల వ్యయానికి సంబంధించి అధికారులు రికార్డులు పక్కాగా నిర్వహించాలని పార్లమెంటరీ నియోజకవర్గ ఎన్నికల వ్యయ పరిశీలకులు సూచించారు. సార్వత్రిక ఎన్నికల్లో పార్లమెంటుకు సంబంధించి ప్రదీప్‌కుమార్, అసెంబ్లీకి సంబంధించి వీజీ శేషాద్రి మీను ఓలాను కేంద్ర ఎన్నికల సంఘం వ్యయ పరిశీలకులుగా నియమించింది. కలెక్టరేట్‌లో శుక్రవారం వారు జిల్లా అధికారులతో సమావేశమయ్యారు. పలు అంశాలపై జిల్లా అధికారులకు దిశానిర్దేశం చేశారు. కలెక్టర్ ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ అభ్యర్థుల వ్యయపరిమితికి మించి ఖర్చు చేస్తే అనర్హతకు గురయ్యే ప్రమాదముందని, సక్రమంగా ఎన్నికల ఖర్చులు ఉండాలని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా ఎస్పీ కృష్ణకాంత్ పాటిల్, డీఆర్వో పెంచలకిషోర్, జిల్లా ఎక్స్పెండేచర్ నోడల్ అధికారి చరణ్ రుద్రరాజు తదితరులు పాల్గొన్నారు.

25లోపు ఓటరు క్లైమ్స్‌ను పరిష్కరించాలి

జిల్లాలో రిటర్నింగ్ ఆఫీసర్ల వద్ద పెండింగ్‌లో ఉన్న ఓటరు క్లైమ్స్‌ను ఈనెల 25లోపు పరిష్కరించాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ప్రవీణ్‌కుమార్ ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ నుంచి వర్చువల్ విధానంలో అధికారులతో సమీక్షించారు. డీఆర్వో , నోడల్ అధికారులు పాల్గొన్నారు.

పోస్టల్ బ్యాలెట్ దరఖాస్తుకు ఎల్లుండి ఆఖరు

పోస్టల్ బ్యాలెట్ దరఖాస్తుకు ఈనెల 22వ తేదీతో ఆఖరు అని కలెక్టర్ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. సార్వత్రిక ఎన్నికల్లో పోలింగ్, సెక్టార్, సూక్ష్మ పరిశీలకుల అధికారులతోపాటు ఇతర ఎన్నికల విధుల్లో ఉన్న ఉద్యోగులకు పోస్టల్ బ్యాలెట్ సౌకర్యం తీసుకొచ్చినట్లు పేర్కొన్నారు.

పుంగనూరులో కోడ్ కొండెక్కింది

- ఆర్వో కార్యాలయంలోకి దూసుకెళ్లిన వైసీపీ నేతలు
- గేట్లు దూకి, పోలీసులను నెట్టేస్తూ లోనికి పరుగులు


పోలీసులను తోసుకొని ఆర్వో కార్యాలయంలోనికి వెళుతున్న వైసీపీ శ్రేణులు

పుంగనూరు, ఏప్రిల్ 19:పుంగనూరు వైసీపీ అభ్యర్థులుగా మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఆయన సతీమణి స్వర్ణలత శుక్రవారం నామినేషన్ దాఖలు చేశారు. ఈ సందర్భంగా ఆ పార్టీ శ్రేణులు యథేచ్ఛగా కోడ్ ఉల్లంఘించాయి. పుంగనూరు శివార్లలోని హనుమంత రాయదిన్నె ప్రసన్న ఆంజనేయస్వామి ఆలయంలో పూజలు, దర్గాలో ప్రార్థనల అనంతరం భారీ ర్యాలీగా బయలుదేరారు. ఎన్టీఆర్ సర్కిల్, పశువుల ఆస్పత్రి, కోర్టు, ఎంపీడీఓ కార్యాలయాల వద్ద పోలీసులు బారికేడ్లు పెట్టి బందోబస్తు ఉన్నారు. అయినా వైసీపీ శ్రేణులు బారికేడ్లను పక్కకు నెట్టి ఆర్వో కార్యాలయం వద్దకు చేరుకున్నారు. అభ్యర్థితోపాటు నలుగురికే అనుమతి ఉందని గేటు వద్ద ఉన్న పోలీసులు చెప్పినా వైసీపీ నాయకులు వినకుండా వారితో వాగ్వాదానికి దిగారు. కొందరు ప్రహరీ గోడ దూకి లోనికి వెళ్లారు. మరికొందరు గేట్లు ఎక్కి గొడవకు దిగారు. పోలీసులను నెట్టేస్తూ ఆర్వో కార్యాలయంలోకి చొచ్చుకెళ్లారు.పెద్దిరెడ్డి నామినేషన్ సందర్భంగా ఉదయం 11గంటల నుంచే మదనపల్లె-చిత్తూరు బైపాస్ రోడ్డులో వాహనాలను మళ్లించారు. 11.30 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు పుంగనూరులో పోలీసులు ట్రాఫిక్ ఆంక్షలు పెట్టడంతో రాకపోకలకు ప్రజలు ఇబ్బంది పడాల్సి వచ్చింది.నామినేషన్ సందర్భంగా వివిధ ప్రాంతాల నుంచి జనాన్ని తరలించిన వైసీపీ నాయకులు విచ్చలవిడిగా మద్యం పంపిణీ చేశారు. మార్కెట్ యార్డు, రామసముద్రం రోడ్డు, బసవరాజస్కూల్ ప్రాంతాల్లో జనాన్ని తీసుకొచ్చిన వాహనాలను నిలిపి అక్కడ మద్యం సేవిస్తూ, బిర్యానీ తింటూ చాలా మంది కనిపించారు.

పెద్దిరెడ్డి అప్పులు రూ.18.50 కోట్లు

పెద్దిరెడ్డి నామినేషన్ సందర్భంగా సమర్పించిన అఫిడవిట్‌లో ఆయన పేరుతో చరాస్తులు రూ.10.59 కోట్లు, ఆయన సతీమణి స్వర్ణలత పేరుతో రూ.14.55 కోట్లు ఉన్నాయి.అలాగే స్థిరాస్తులు పెద్దిరెడ్డి పేరుతో రూ.114.25కోట్లు, ఆయన సతీమణి పేరుతో రూ.96 కోట్లు ఉన్నాయి. పెద్దిరెడ్డి పేరుతో రూ.18.50 కోట్ల అప్పులు, ఆయన సతీమణికి రూ.34.74 కోట్ల అప్పులు ఉన్నాయి. రూ.14.15 కోట్ల విలువ చేసే వ్యవసాయ భూములు, రూ.1.37కోట్ల విలువైన వ్యవసాయేతర భూములు పెద్దిరెడ్డి పేరుతో ఉన్నాయి. ఆయన భార్య పేరుతో రూ.8.92కోట్ల విలువ చేసే వ్యవసాయ భూములు, రూ.22.50 కోట్ల విలువైన వ్యవసాయేతర భూములు ఉన్నాయి.

రోజా స్థిర, చరాస్తులు 10.63 కోట్లు

చిత్తూరు, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): నగరి ఎమ్మెల్యే రోజా నామినేషన్ సందర్భంగా సమర్పించిన అఫిడవిట్‌లో తన మొత్తం ఆస్తుల విలువ రూ.10.63కోట్లుగా పేర్కొన్నారు. చరాస్తులు రూ.4.58 కోట్లు, స్థిరాస్తులు రూ.6.05 కోట్లుగా పేర్కొన్నారు.రూ.1.59 కోట్లు విలువ చేసే నాలుగు కార్లు ఉన్నాయి. రూ.కోటి విలువ చేసే బెంజ్ కారు ఉంది. దాన్ని కొనేందుకు రూ.94లక్షలు బ్యాంక్ ద్వారా రుణం తీసుకున్నట్లు చూపించారు. వైసీపీ అధికారంలోకి వచ్చాక నగరి నియోజకవర్గంలో 6.39 ఎకరాల భూమి కొనుగోలు చేశారు. ఆమె మీద 2019 ఎన్నికల సమయం నాటికి కేసులు ఉండగా.. ఇప్పుడు కేసులేం లేవు.

తిరుపతి

ఒంటిమిట్ట కల్యాణోత్సవానికి 1.20 లక్షల శ్రీవారి లడ్డూలు

తిరుమల, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): కడప జిల్లాలోని ఒంటిమిట్ట ఆలయంలో జరుగుతున్న శ్రీరామనవమి బ్రహ్మోత్సవాల్లో భాగంగా 22వ తేదీ జరిగే సీతారాముల కల్యాణోత్సవానికి వచ్చే భక్తులకు అందించేందుకు తిరుమల శ్రీవారి లడ్డూలు సిద్ధమయ్యాయి. తిరుమలలోని శ్రీవారి సేవాసదన్‌లో శుక్రవారం శ్రీవారి సేవకుల సహకారంతో మినీ(25 గ్రాములు) లడ్డూలను ప్యాక్ చేశారు. డిప్యూటీ ఈవో శివప్రసాద్, పోటు ఏఈవో శ్రీనివాసులు ఆధ్వర్యంలో దాదాపు 250మంది శ్రీవారిసేవకులు 1.20లక్షల లడ్డూలను 60 వేల జిప్‌లాక్ ప్యాకెట్లలో ఉంచారు. ఒక్కో ప్యాకెట్‌లో రెండు లడ్డూల చొప్పున ప్యాక్ చేశారు.సీతారాముల కల్యాణంలో పాల్గొనే భక్తులకు ఈ లడ్డూలను ప్రసాదంగా అందజేయనున్నారు.

నేడు, రేపు కనెక్ట్ టు ఫార్మర్ ఆర్గానిక్ మేళా

తిరుపతి అర్బన్, ఏప్రిల్ 19: మహతి కళాక్షేత్రంలో శని, ఆదివారాల్లో కనెక్ట్ టు ఫార్మర్(ఎన్‌జీవో) రైతుల సంస్థ ఆర్గానిక్ మేళాను ఏర్పాటు చేస్తున్నట్లు నిర్వాహకులు శిల్ప శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. రైతులు నేరుగా తమ ఆర్గానిక్ పంటలను వినియోగదారులకు విక్రయించడం, దిగువ, మధ్య తరగతి కుటుంబాలకు కూడా అందుబాటులోకి తీసుకురావడం, దేశవాళీ పంటలను, ప్రకృతి వ్యవసాయ సాగు భూమిని పెంచడం ఈ రైతుల సంస్థ ఉద్దేశం అన్నారు. వివరాలకు 63036 06326 నెంబరును సంప్రదించాలని కోరారు. ● శనివారం ఉదయం 10.30గంటలకు మేళా ప్రారంభం, 11గంటలకు గంగిరెడ్డిచే ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులతో కషాయాల తయారీ, మధ్యాహ్నం ఒంటిగంటకు ఐదు రకాల దేశవాళీ బియ్యాలతో భోజనం, 3గంటలకు మిద్దెతోటల, దేశవాళి పండ్లు, పూల మొక్కలపై రైతులకు గ్రాఫ్టింగ్‌పై శిక్షణ, సాయంత్రం ఆరు గంటలకు డాక్టర్ సింధుమలరిచే కంపోస్టింగ్‌పై అవగాహన కార్యక్రమం ఉంటాయి. ● ఆదివారం ఉదయం 10గంటలకు విజయరామ్‌చే పండ్ల మొక్కలు వివిధ అంచెల్లో పండించే విధానం, మధ్యాహ్నం ఒంటి గంటకు ఐదు రకాల దేశవాళీ బియ్యంతో భోజనం, 2.30గంటల నుంచి విజయరామ్ ప్రసంగం కొనసాగింపు, దేశవాళీ వరి పారముఖ్యం, ఇంటి దగ్గర, పొలంలో ఇంకుడు గుంతల ఏర్పాటు చేయడంపై, సాయంత్రం ఐదు గంటలకు ప్రకృతివనం ప్రసాద్‌చే ఆరోగ్యమైన జీవనశైలిపై ప్రసంగం ఉంటుంది.

వేడుకగా కోదండరాముడి పట్టాభిషేకం



స్వామి వారి కిరీటాన్ని భక్తులకు చూపుతున్న అర్చకులు

తిరుపతి(కల్చరల్), ఏప్రిల్ 19: కోదండరామాలయంలో పచ్చనితోరణాలతో, దీపకాంతులతో కళకళలాడిన కల్యాణ వేదికపై శుక్రవారం శ్రీరామ పట్టాభిషేకం కన్నులపండువగా జరిగింది. శ్రీరామ నవమి ఉత్సవాల్లో భాగంగా రాత్రి ఏడు గంటల నుంచి శ్రీరామ పట్టాభిషేకం వైభవంగా నిర్వహించారు. రాత్రి 8.30 గంటలకు బంగారు తిరుచ్చి వాహనంపై సీతారాములు, ప్రత్యేక తిరుచ్చిపై ఆంజనేయ స్వామి ఆలయ మాడవీధుల్లో విహరించారు. ఆలయ డిప్యూటీ ఈవో నాగరత్న, ఏఈవో పార్థసారథి, సూపరింటెండెంట్ సోమశేఖర్, భక్తులు పాల్గొన్నారు.

రైలు కింద పడి వ్యక్తి మృతి



తిరుపతి(నేరవిభాగం), ఏప్రిల్ 19: తిరుపతి-తిరుచానూరు రైల్వేస్టేషన్ మధ్యలో శుక్రవారం రైలు కింద పడి ఓ వ్యక్తి మృతి చెందాడు. రైల్వే సీఐ హేమసుందరరావు తెలిపిన వివరాల మేరకు.. 40-45 ఏళ్ల వయసున్న వ్యక్తి నీలం రంగు రౌండ్ నెక్ టీషర్టు, నీలం రంగు షార్టు ధరించి ఎల్‌సీ గేటు నెంబరు 108 వద్ద రైలు కింద పడి మృతి చెందాడు. అతడి వద్ద మొబైల్ ఫోన్, హీరో హోండా బైక్ తాళాలు లభ్యమయ్యాయి. ఆచూకీ తెలిసిన వారు 94406 27638 నెంబరుకు ఫోన్ చేయాలని సీఐ విజ్ఞప్తి చేశారు.

కాంగ్రెస్ ఇంటింటి ప్రచారం



కాంగ్రెస్ నేతలతో చింతామోహన్

తిరుపతి(కపిలతీర్థం), ఏప్రిల్ 19: పద్మావతీపురం, ఎస్వీనగర్, పద్మావతి మహిళా యూనివర్సిటీ ప్రాంతాల్లో శుక్రవారం కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి చింతా మోహన్ ఇంటింటి ప్రచారం చేశారు. నేతలు రాంభూపాల్‌రెడ్డి, గోపీగౌడ్, తేజోవతి, శాంతి యాదవ్, మునిశోభ, జావెద్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

ఈవీఎంలో దొంగ పనులు చేయకుంటే చాలు

తిరుపతి(కలెక్టరేట్): 'మా అందరిలో ఉండే అనుమానం ఒకటే. అధికార పార్టీ ఈవీఎంలో దొంగ పనులు చేయకుండా ప్రజాస్వామ్యాన్ని కాపాడితే చాలు' అని చింతామోహన్ అన్నారు. నామినేషన్ దాఖలు చేశాక కలెక్టరేట్ వెలుపల మీడియాతో ఆయన ఈ వ్యాఖ్య చేశారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.02 కోట్లు

తిరుమల, ఏప్రిల్19 (ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.3.02 కోట్లు లభించింది. బుధవారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ గురువారం లెక్కించి శుక్రవారం ప్రకటించింది.

రుయాలో అలంకార ప్రాయంగా ఏసీలు

విలవిల్లాడుతున్న రోగులు



తిరుపతి(వైద్యం), ఏప్రిల్ 19: రుయాస్పత్రిలో ఏసీలు అలంకార ప్రాయంగా తయారయ్యాయి. దీంతో మండుతున్న ఎండలకు వార్డుల్లో చికిత్స పొందుతున్న రోగులు విలవిల్లాడుతున్నారు. ఆస్పత్రిలో పేరుకు దాదాపు 500కి పైగా ఏసీలున్నా అధికారుల గదుల్లోనివి తప్ప రోగుల వార్డుల్లోనివి పనిచేయడం లేదు. అత్యవసర విభాగంలోనూ, వ్యాధి తీవ్రత ఎక్కువగా ఉన్న రోగులకు చికిత్స అందించే ఆర్‌ఐసీయూ, ఏఎంసీ, ఐసీయూవార్డుల్లో సైతం ఏసీలు పనిచేయడం లేదు. ఎంఎం, ఎఫ్ఎం, బర్న్ వార్డులతో పాటు పలు వార్డుల్లోని ఏసీలు కూడా అలంకార ప్రాయంగానే దర్శనమిస్తున్నాయి. అధికారులు లక్షలు ఖర్చుపెట్టి ఏసీలు కొనుగోలు చేసి వార్డుల్లో అమర్చుతున్నారే తప్ప వాటి నిర్వహణపై ఎలాంటి శ్రద్ధ చూపడం లేదు. భవిష్యత్తులో ఎండ తీవ్రత ఇంకా పెరిగే అవకాశాలు ఉండటంతో ఇకనైనా అధికారులు వార్డుల్లో ఉండే ఏసీలకు మరమ్మతులు చేపట్టి, అందుబాటులోకి తీసుకురావాలని రోగులు కోరుతున్నారు.

తిరుపతిలో అరాచకాల్లేని పాలన అందిస్తాం

● జనసేన ఎమ్మెల్యే అభ్యర్థి ఆరణి హామీ



ప్రచారం చేస్తున్న ఆరణి శ్రీనివాసులు

తిరుపతి, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): తిరుపతి నియోజకవర్గంలో అరాచకాలకు తావులేని పాలన అందిస్తామని టీడీపీ, బీజేపీ బలపరుస్తున్న జనసేన ఎమ్మెల్యే అభ్యర్థి ఆరణి శ్రీనివాసులు హామీ ఇచ్చారు. ఐదేళ్లలో ఎమ్మెల్యే భూమన కరుణాకర రెడ్డి, ఆయన కుమారుడు అభినయ్ రెడ్డి తిరుపతి నగరాన్ని చెడగొట్టారని ఆరోపించారు. శుక్రవారం ఉదయం 24, 25 డివిజన్లలో టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జి బుల్లెట్ రమణ ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం జరిగింది. అరాచకాలు, అక్రమాలు లేని తిరుపతి తన ధ్యేయమని ఈ సందర్భంగా ఆరణి చెప్పారు. ఐదేళ్లలో తిరుపతి అభివృద్ధిని గాలికొదిలిన అబ్బా కొడుకులు తమ సొంత లాభం మాత్రం చూసుకున్నారని మండిపడ్డారు. వీరు అవసరమైతే ఎవరి కాళ్లయినా పట్టుకుంటారని, అవసరం తీరాక వదిలేస్తారని విమర్శించారు. ప్రజలు అంతా గమనిస్తున్నారని, త్వరలో జరిగే ఎన్నికల్లో తండ్రీ తనయులకు తగిన గుణపాఠం చెబుతారన్నారు. జనసేన ఎన్నికల గుర్తు గాజు గ్లాసుపై ఓటేసి తనను గెలించాలని, కమలం గుర్తుపై ఓటేసి తిరుపతి పార్లమెంట్ అభ్యర్థి వరప్రసాద్‌ను గెలిపించాలని కోరారు. ఈ ప్రచారంలో మాజీ ఎమ్మెల్యేలు సుగుణమ్మ, మోహన్, టీడీపీ నేతలు నరసింహయాదవ్, డాక్టర్ కోడూరు బాలసుబ్రహ్మణ్యం, దంపూరు భాస్కర్ యాదవ్, చిన బాబు, పాటకం వెంకటేష్, మన్నెం శ్రీనివాసులు నాయుడు, రుద్రకోటి సదాశివం, సింగంశెట్టి సుబ్బరామయ్య, ఆముదాల తులసీరాం, కరాటే చంద్ర, డివిజన్ నాయకులు జలగం ఆనంద్, త్యాగరాజు, రాజారామ్, విశ్వనాథం, రమణ, బీజేపీ నాయకులు భానుప్రకాష్ రెడ్డి, సామంచి శ్రీనివాస్, అజయ్ కుమార్, పొనగంటి భాస్కర్, వరప్రసాద్, జనసేన నాయకులు ఆర్కాట్ కృష్ణ ప్రసాద్, ఆకేపాటి సుభాషిణి, బండ్ల లక్ష్మీపతి రాయల్ పాల్గొన్నారు.



ఆరణికి మంగళ హారతితో స్వాగతం



శ్రీగంధం వనానికి సమీపంలో ఎగసిపడుతున్న మంటలు- (ఇన్‌సెట్లో) మంటలను అదుపుచేస్తున్న సిబ్బంది

ఎగసిపడిన అగ్నికీలలు

● నాలుగు రోజులుగా కాలుతూనే ఉన్న శేషాచలం అడవి

తిరుమల, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): తిరుమల శేషాచల అడవుల్లో మంటలు కొనసాగుతూనే ఉన్నాయి. నాలుగురోజుల క్రితం మొదలైన మంటలు క్రమంగా వ్యాప్తిచెందుతూ తిరుమలకు సమీపానికివచ్చి బెంబేలెత్తించాయి. మామండూరుకు సమీపంలోని అడవిలో మంగళవారం మొదలైన మంటలు క్రమంగా సానరాళ్ల బండ వైపుగా వస్తుండటంతో అటవీప్రాంతం భారీగా కాలిబూడిదైంది. శుక్రవారం కాకులకొండ మీదుగా పాపవినాశనం మార్గంలోని పార్వేటమండపం, శ్రీగంధవనం వైపుగా మంటలు వ్యాపించి.. అక్కడి అడవి అగ్నికి ఆహుతైంది. గాలులు జోరుగా వీస్తుండటంతో క్షణాల వ్యవధిలోనే మంటలు వ్యాపిస్తూ పాపవినాశనం రోడ్డుకు, శ్రీగంధం వనానికి సమీపంలోకి వచ్చేశాయి. ఈప్రాంతాలను భారీగా పొగ కమ్మేసింది. మంటలు తిరుమల సమీపానికి వస్తున్న క్రమంలో టీటీడీ ఫారెస్ట్, ప్రభుత్వ ఫారెస్ట్, విజిలెన్స్, ఫైర్ ఫైటర్స్ ప్రభుత్వ ఫైర్ అధికారులు, సిబ్బంది ఘటనా ప్రాంతానికి చేరుకున్నారు. మంటలను అదుపుచేసే ప్రయత్నం చేశారు. వీరు సకాలంలో అప్రమత్తం కాకుంటే మంటలు రోడ్డు దాటి తిరుమలవైపుగా వచ్చి.. భారీ ప్రమాదం వాటిల్లి ఉండేది.



కాలిపోయిన అడవి



అడవి నుంచి భారీగా వస్తున్న పొగ

500 హెక్టార్ల అడవి కాలిపోయి ఉండవచ్చని అంచనా

దాదాపు 500 హెక్టార్ల అడవి కాలిపోయి ఉండవచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు. వందల ఎకరాల్లోని అటవి మసిబారిపోయింది. అలాగే మంటలు భారీగా ఎగసిపడిన నేపథ్యంలో రెండు చిరుతలతోపాటు నాలుగు ఎలుగుబంట్లు పరుగులు తీస్తూ అటవీశాఖ సిబ్బంది కంటపడ్డాయి. అనేక వన్యప్రాణులు మంటల నుంచి దూరంగా పారిపోయాయి. కాగా, మంటలు తిరుమల దిశగా రాకుండా కాంటూర్స్‌ని అధికారులు మరింత విస్తరింపజేశారు.

తిరువణ్ణామలైకి ఏసీ సర్వీసులు షురూ

తిరుపతి(ఆర్టీసీ), ఏప్రిల్ 19: తమిళనాడులోని తిరువణ్ణామలై విశిష్టత దృష్ట్యా ఆర్టీసీ రెండు ఏసీ (ఇంద్ర) సర్వీసులను ఏర్పాటు చేశారు. ఎండల తీవ్రత దృష్ట్యా కొద్ది రోజులుగా ఓ ఏసీ బస్సును నడపడంతో ప్రయాణికుల నుంచి ఆదరణ లభించింది. ఈక్రమంలో రోజులో రెండు ట్రిప్పులు ఏర్పాటు చేయాలని అధికారులు భావించి మరో బస్సును కేటాయించారు. రెండో బస్సును కూడా శుక్రవారం ప్రారంభించి ఇకపై నిరంతరాయంగా నడిపేందుకు సమయాలు కూడా ఖరారు చేశారు.

బస్సులు నడిచే వేళలివా: సెంట్రల్ బస్సుస్టేషన్‌లోని శ్రీనివాసబస్టాండు ప్లాట్‌ఫామ్ 27లో మొదటి బస్సు ఉదయం 6.30గంటలకు బయల్దేరుతుంది. వయా చిత్తూరు, వేలూరు మీదుగా మధ్యాహ్నం 12గంటలకు తిరువణ్ణామలైకి చేరుకుంటుంది. తిరిగి ఒంటి గంటకు బయల్దేరి అదే మార్గంలో ప్రయాణిస్తూ సాయంత్రం 5గంటలకు తిరుపతికి చేరుకుంటుంది. రెండో బస్సు మధ్యాహ్నం 2గంటలకు తిరుపతిలో బయల్దేరి సాయంత్రం 7గంటలకు తిరువణ్ణామలైకి చేరుకుంటుంది. తిరిగి అక్కడ నుంచి రాత్రి 11గంటలకు బయల్దేరి ఉదయాత్పూర్వం 4గంటలకు తిరుపతికి చేరుకుంటుంది. ఇందులో పెద్దలకు రూ.460, పిల్లలకు రూ.230 టిక్కెట్ ధర నిర్ధారించారు. 60రోజుల ముందుగా రిజర్వేషన్ సౌకర్యం కల్పించినట్లు బస్టాండు ఏటీఎం డి.రామచంద్రనాయుడు తెలిపారు.

22న ఎస్వీయూలో క్యాన్సర్‌పై అవగాహన

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఏప్రిల్ 19: ఎస్వీయూనివర్సిటీలో ఈ నెల 22వ తేదీన క్యాన్సర్‌పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. శ్రీవేంకటేశ్వర ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ క్యాన్సర్ కేర్-అడ్వాన్స్‌డ్ రీసెర్చ్ సహకారంతో పాపులేషన్ స్టడీస్ - సోషియల్ వర్క్ - ఉమెన్ స్టడీస్ విభాగాలు సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టాయి. ఉదయం10గంటలకు శ్రీనివాసా ఆడిటోరియంలో ఈకార్యక్రమం ప్రారంభం కానుంది. వీసీ శ్రీకాంత్‌రెడ్డి, ఎస్వీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ క్యాన్సర్ కేర్-అడ్వాన్స్‌డ్ రీసెర్చ్ ప్రతినిధులు డాక్టర్ ప్రశాంతి, హేమంత్ కుమార్ పాల్గొంటారు. ఈ మేరకు వర్సిటీ పాపులేషన్ స్టడీస్ - సోషియల్ వర్క్ విభాగాధిపతి చంద్రశేఖరయ్య తెలిపారు.

రుయాలో పురిటి బిడ్డకు అరుదైన శస్త్ర చికిత్స

తిరుపతి(వైద్యం), ఏప్రిల్ 19: రుయాస్పత్రిలోని చిన్నపిల్లల వార్డులో పురిటిబిడ్డకు అరుదైన శస్త్ర చికిత్స చేసినట్లు చిన్నపిల్లల విభాగాధిపతి డాక్టర్ మనోహర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. నెల్లూరు జిల్లాకు చెందిన ఓ పురిటిబిడ్డకు మలద్వారం పూర్తిగా మూసుకుపోయి ఉండటంతో రుయా చిన్నపిల్లల వార్డుకు తీసుకువచ్చారన్నారు. దీంతో డాక్టర్ సుధాకర్, డాక్టర్ రాజ్‌కిరణ్‌లతో కలిసి బాలుడికి శస్త్ర చికిత్స నిర్వహించి మలద్వారాన్ని సాధారణ స్థితికి తీసుకువచ్చామన్నారు. ప్రస్తుతం బాలుడు పూర్తి ఆరోగ్యంగా ఉన్నాడని ఆయన తెలిపారు. ఇలాంటి అరుదైన శస్త్ర చికిత్సను ప్రైవేటు ఆస్పత్రుల్లో చేసేందుకు రూ.1.50లక్షలకుపైగా ఖర్చవుతుందని ఆయన పేర్కొన్నారు.

ఎన్డీఏకి అండగా నిలవండి

తిరుపతి బీజేపీ ఎంపీ అభ్యర్థి వెలగపల్లి వరప్రసాదరావు





మందకృష్ణతో మాట్లాడుతున్న వరప్రసాదరావు - నల్లపరెడ్డి జగన్‌మోహన్‌రెడ్డితో వరప్రసాదరావు తదితరులు

చంద్రగిరి/గూడూరు/కోట, ఏప్రిల్ 19:రాష్ట్రాభివృద్ధికి ఎన్డీఏ కూటమి కృషి చేస్తుందని అటువంటి కూటమికి అందరూ అండగా ఉండాలని తిరుపతి బీజేపీ ఎంపీ అభ్యర్థి వెలగపల్లి వరప్రసాదరావు పిలుపునిచ్చారు. శుక్రవారం చంద్రగిరిలో ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణతో సమావేశం అయ్యారు. ఎమ్మార్పీఎస్ అను బంధ సంఘం ఎంఎస్‌పి సమావేశంలో మందాకృష్ణమాదిగతో కలసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మందకృష్ణ మాట్లాడుతూ... ఎమ్మార్పీఎస్ లక్ష్యాలను అర్థం చేసుకున్న వ్యక్తి వరప్రసాదరావు అని ఆయనకు అండగా ఉంటామని ఆయన గెలుపునకు కృషి చేస్తామన్నారు. అనంతరం వరప్రసాదరావు మాట్లాడుతూ వైసీపీ అరాచక ప్రభుత్వాన్ని సాగనంపేందుకు కలసి కట్టుగా ముందుకురావాలని పిలుపునిచ్చారు.

గూడూరులో ...

తిరుపతి బీజేపీ ఎంపీ అభ్యర్థి వెలగపల్లి వరప్రసాదరావు శుక్రవారం ఉదయం గూడూరులో పలు ప్రాంతాలలో ప్రచారం నిర్వహించారు. తాను ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో చేసిన అభివృద్ధిని వివరించారు. ఎంపీగా తనకు ఓటు వేసి గెలిపించాలని పిలుపునిచ్చారు. అనంతరం పార్కుకు వెళ్లి అక్కడ స్థానికులతో మాటామంతి జరిపారు. పార్కు అభివృద్ధికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

దళితులంటే జగన్‌కు చులకన...

సీఎం జగన్‌కు దళితులంటే చాల చులకన భావమని అందుకే 23 మంది దళిత ఎమ్మెల్యేలకు టిక్కెట్లు నిరాకరించారని తిరుపతి బీజేపీ ఎంపీ అభ్యర్థి వెలగపల్లి వరప్రసాదరావు దుయ్యబట్టారు. శుక్రవారం సాయంత్రం కోట పట్టణంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. అనంతరం ఎన్‌డీసీసీబీ మాజీ వైఎస్ ఛైర్మన్ నల్లపరెడ్డి జగన్ మోహన్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. టీడీపీలో చేరుతున్న ఆయనకు అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా జగన్ మోహన్‌రెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే బీజేపీ, టీడీపీతోనే సాధ్యమన్నారు. ఈ సమావేశంలో వారితోపాటు బీజేపీ నాయకులు పురుషోత్తమరెడ్డి, కోటేశ్వరరావు, రమేష్‌బాబు, అంబరీష్ తదితరులు పాల్గొన్నారు.

కేంద్రీయ విద్యాలయలో 'ప్రేరణ'

తిరుపతి(విద్య), ఏప్రిల్ 19: కేంద్రీయ విద్యాలయం-1లో జిల్లా స్థాయి ప్రేరణ ఉత్సవ కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన తిరుపతి ఉప విద్యాశాఖాధికారి బాలాజి మాట్లాడుతూ.. అపజయాలనే విజయ సోపానాలుగా మార్చుకోవాలని విద్యార్థులకు సూచించారు. రాష్ట్ర పరిశీలకులు అపర్ణ మాట్లాడుతూ.. గుజరాత్‌లోని వ్యాద్‌నగర్‌లో జరిగే జాతీయ స్థాయి ప్రేరణ ఉత్సవ కార్యక్రమానికి జిల్లా నుంచి ఎ.యువకిరణ్‌కుమార్, ఎండీ అక్షయను ఎంపిక చేసినట్లు తెలిపారు. అకడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ శివశంకరయ్య, అసిస్టెంట్ అకడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ మధు, డిస్ట్రిక్ట్ సైన్స్ ఆఫీసర్ భానుప్రకాష్, విద్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పేద విద్యార్థికి చేయూత



తిరుపతి అర్బన్, ఏప్రిల్ 19: పేద విద్యార్థికి ఐక్యం చారిటబుల్ ట్రస్టు ఆర్థిక సాయమందించి అండగా నిలిచింది. పుంగనూరుకు చెందిన కె.గణేష్ తిరుపతిలో స్నేహితుడి సాయం తీసుకుని కాస్ట్ అకౌంటెంట్ చదువుతున్నాడు. తుది సంవత్సరం విద్యాభ్యాసానికి నగదు కొరత ఏర్పడి.. ట్రస్టు ప్రతినిధులను ఆశ్రయించాడు. స్పందించిన వారు తమవంతుగా రూ.53వేలను శుక్రవారం అందజేశారు. ఆ యువకుడికి చదువు పూర్తి కావడానికి ఇంకో రూ.40వేలు అవసరమని, దాతలు సాయం చేయాలని, వివరాలకు 93924 47474 నెంబరును సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు చైర్మన్ చింతం శ్రీనివాసులురెడ్డి, కార్యదర్శి సాయిధనశేఖర్, ట్రెజరర్ యుగంధర్, కామిశెట్టి బాలాజి, వెంకటేష్, దేవేంద్ర తదితరులు పాల్గొన్నారు.

నందిని స్వీట్స్ అండ్ బేకరీ ప్రారంభం

తిరుపతి అర్బన్, ఏప్రిల్ 19: ఎయిర్ బైపాస్‌రోడ్డులోని రేబో డైనర్ కాంప్లెక్స్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన నందిని స్వీట్స్ అండ్ బేకరీ ఆరో బ్రాంచ్‌ని యజమానులు రోశిరెడ్డి, గవీన్‌రెడ్డి, నందినిరెడ్డి, తేజస్వి శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా అర కిలో స్వీట్ కొనుగోలుచేస్తే అర కిలో స్వీట్, కుకీస్ బాక్స్ ఆఫర్ ఉందని తెలిపారు. ఈ అవకాశాన్ని నగర ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వినయ్‌కుమార్‌రెడ్డి, మహేశ్వర్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.



ఎన్నికల సమయంలో బీసీలు గుర్తుకొచ్చారా?

ఎమ్మెల్యే భూమనను ప్రశ్నించిన టీడీపీ నగరాధ్యక్షుడు



ఫొటోలు చూపుతూ మీడియాకు వివరాలు తెలియజేస్తున్న చినబాబు తదితరులు

తిరుపతి(ఆటోనగర్), ఏపిల్ 19: ఎన్నికల సమయంలో బీసీలు గుర్తుకొచ్చారా.. అని ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డిని టీడీపీ నగరాధ్యక్షుడు వట్టికుంట శంకరనారాయణ చౌదరి (చినబాబు) ప్రశ్నించారు. శుక్రవారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. మేయర్ అయినా కూడా శిరీషను పక్కన పెట్టేశారని ఆరోపించారు. ఇపుడు వైసీపీ అభ్యర్థి నామినేషన్ దాఖలు సమయంలో మాత్రం ఆమెను ముందు వరుసలో ఉంచడంలో వారి నాటకం బయటపడిందని చెప్పారు. అధికారులు నిబంధనల మేరకు నామినేషన్ల ప్రక్రియ నిర్వహించాలని కోరారు. ఎమ్మెల్యే తన తనయుడు ఆస్తులకు విలువలు పెంచే ఉద్దేశంతోనే వడమాలపేట మండలం ఎస్వీపురం వద్ద టీటీడీ ఉద్యోగులకు స్థలాలు కేటాయించారని ఆరోపించారు. జనసేన నేత ఆర్కాట్ కృష్ణప్రసాద్ మాట్లాడుతూ.. తిరుపతి ఎమ్మెల్యే తన స్వార్థం కోసం పనిచేయడం విడ్డూరంగా ఉందన్నారు. అందువల్ల ప్రజల కోసం పనిచేసే వ్యక్తి ఆరణి శ్రీనివాసులును ఆదరించాలని కోరారు. ఈ సమావేశంలో నాయకులు ఆర్.సుబ్బరామనాయుడు,నాగ ప్రసాద్, లక్ష్మీపతినాయుడు, మునికుమార్, దేవకుమార్, సుమన్ తదితరులు పాల్గొన్నారు.

అక్కడ ల్యాండ్ అయితే... ఓడినట్టే

● సెంటిమెంట్

ఎన్నికల సమయంలో రాజకీయ పార్టీలు ముహూర్త బలంతో పాటు కొన్ని సెంటిమెంట్లను బలంగా నమ్ముతుంటారు. ఆ సెంటిమెంట్లకు ఎదురుగా వెళ్లేందుకు సాహసించరు. ఇలాంటిదే సత్యవేడులో ఓ సెంటిమెంట్‌ను రాజకీయ నాయకులు పాటిస్తుంటారు. సత్యవేడు పర్యటనకు వచ్చే ముఖ్యమంత్రులు, ప్రధాన మంత్రులు స్థానిక ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో హెలికాప్టర్ ల్యాండ్ అయితే ఓడిపోవడం ఖాయమనే నానుడి ఉంది. అప్పటి ప్రధాని ఇందిర గాంధీ, ఎన్టీఆర్, చంద్రబాబు తదితరులు ఎంతో మంది ఇక్కడ హెలికాప్టర్‌ను ల్యాండ్ అయిన ప్రతీసారి అధికారం కోల్పోవలసి వచ్చిందని ఇక్కడ నాయకుల నమ్మకం.

- సత్యవేడు



అట్టుంటనా!




ఎలక్షన్ షాట్స్



చావు అయినా సంబరం అయినా టపాసులు కాల్చి సందడి చేస్తుంటారు. థౌజండ్ వాలాలు, రాకెట్లు పేలుస్తుంటారు. ఇప్పుడా ట్రెండ్ మారింది. ఒక్కొక్క రాకెట్టునూ చేత్తో పట్టుకుని ఒత్తి ఎలిగించి ఎగరేసే సీను కనిపించడం లేదు. వీటి బదులు షాట్స్ రంగంలోకి వచ్చాయి. షాట్స్ బాక్స్‌ను నేలమీద పెట్టి ఒత్తి వెలిగిస్తే చాలు వరుసగా నుయ్.. నుయ్ మంటూ గాల్లోకి దూసుకుపోయి పెద్ద శబ్దం చేస్తూ పేలుతాయి. రంగురంగుల పూలు వెదజల్లుతాయి. 30 షాట్స్ నుంచి 240 షాట్స్ దాకా మార్కెట్లో దొరుకుతున్నాయి. వీటి ధరలు రూ.1000 నుంచి 5000 దాకా ఉన్నాయి. ఎన్నికల ప్రచారాల్లో వీటికి మంచి గిరాకీ ఏర్పడింది. శ్రీకాళహస్తి సహా ప్రతి పట్టణంలోనూ టపాసుల దుకాణాలు దీపావళితో సంబంధం లేకుండా అమ్మకాలతో పండగ చేసుకుంటున్నాయి.

- శ్రీకాళహస్తి

నో స్టాక్



తిరుపతిలో చాలా వైన్ షాపులు ఎప్పుడు చూసినా మూతబడి కనిపిస్తున్నాయి. సంపూర్ణంగా మద్యం నిషేధించిన తర్వాతనే ఓట్లు అడుగుతా అని చెప్పిన జగన్ దాన్ని నిజం చేశారా అని మందుబాబులు హడలిపోతూ ఆరాలు తీస్తున్నారు. తీరా చూస్తే షాపుల ముందు నో స్టాక్ బోర్డులు వేలాడదీస్తున్నారు. రోజూ రాత్రి పది దాటినా తెరిచే ఉంటారు కదా ఇప్పుడేంది పగలే నో స్టాక్ అని పెట్టేస్తున్నారు? అని మందు ప్రియులు తెగ ఆశ్చర్యపడిపోతున్నారు. అసలు కతేమిటంటే మద్యానికి ఎన్నికల ఎఫెక్ట్ తగిలింది. ప్రచారాలకు పిలిచినా, సభలకు జనాన్ని పోగేసినా క్వార్టర్ బాటిల్ తప్పనిసరి అయ్యింది. దీంతో నాయకులు తెగ కొనేసి దాచేస్తున్నారు. అధికారంలో ఉన్న నాయకులు ప్రత్యర్థులకు ఈ అవకాశం ఇవ్వకుండా వచ్చిన స్టాకు వచ్చినట్టు దుకాణాలకు చేరకముందే తమ రహస్య ప్రదేశాలకు తరలించేస్తున్నారని చెబుతున్నారు. తిరుపతి జిల్లాలో 253 ప్రభుత్వ మద్యం దుకాణాలు, 39 బార్లు వున్నాయి. ఇవి కాకుండా వాక్ ఇన్ లిక్కర్ స్టోర్లు నాలుగు వున్నాయి. వీటి ద్వారా రోజుకు దాదాపు రూ 6.50 కోట్లు పైచిలుకు వ్యాపారం జరుగుతోంది. ప్రత్యేక రోజులు, పండగలు, పబ్బాలు అయితే రోజువారీ అమ్మకాలు రూ 10 కోట్లు దాటుతున్నట్లు సమాచారం. ఎన్నికల రోజుల్లో పది శాతంకి మించి రోజువారీ అమ్మకాలు పెరగడానికి లేదన్నది నిబంధన. ఇందువల్లే ఏ రోజు కారోజు స్టాకు తరలిపోతోందని తెలుస్తోంది. మరోవైపు ప్రభుత్వ మద్యం దుకాణాలు రాత్రి 8 గంటల వరకు తెరచి వుంచాలని, స్టాక్ అయిపోయిందని మూసివేస్తే సిబ్బందిపై చర్యలు తీసుకుంటామని అధికారులు మాత్రం హెచ్చరిస్తూనే ఉన్నారు.

- తిరుపతి (నేరవి భాగం)



వీరి ఉసురు తగలదా?

ప్రభుత్వ ఉద్యోగులుగా రిటైరైతే ఎలాంటి చీకూచింతా ఉండదు. టెన్షను ఉండదు. కుటుంబ సభ్యులతో నిశ్చింతగా విశ్రాంత జీవితం గడిపేయొచ్చు.

- ఇదీ పెన్షనర్ల గత ఆలోచన. వైఎస్ జగన్ జమానాలో సీను మొత్తం మారిపోయింది. ఒకటో తేదీ వస్తుందంటే వీరందరిలోనూ టెన్షన్ మొదలవుతోంది.

- తిరుపతి(కలెక్టరేట్)



మోసం గురూ!

ప్రశాంతంగా గడపాల్సిన విశ్రాంత ఉద్యోగుల బతుకు ఇప్పుడు దినదిన గండంగా మారింది. గతంలో ఠంచనుగా ఒకటో తేదీనే పింఛను అందేది. ఎలాంటి ఇబ్బంది లేకుండా హాయిగా జీవించేవారు. జగన్ గద్దెనెక్కిన తరువాత పింఛనుదారుల కష్టాలు దారుణంగా తయారయ్యాయి. ఒకటో తేదీ రాగానే నెలవారీ చెల్లింపులు, ఖర్చులు, మందులకు చేతిలో నగదు లేక అల్లాడిపోతున్నారు. ప్రతి నెలా 1 నుంచి 5వ తేదీ మధ్యలో అందాల్సిన పింఛను ఎపుడు వస్తుందో తెలియదు. డీఏ, పీఆర్సీ బకాయిలకు దిక్కే లేదు. . పీఆర్సీతో పెరగాల్సిన పెన్షన్‌లోనూ కోతలు పెడుతున్నారు. వైద్య భరోసాకు ఈహెచ్‌ఎస్ కింద నగదు మినహాయించుకుంటున్నా.. ఆరోగ్య ధీమా మాటలకే పరిమితమైంది. రిటైరయ్యాక ఆర్థిక ప్రయోజనాలు సక్రమంగా అందడంలేదు. పెన్షన్‌పై ఆశతో రుణం తీసుకున్నవారు ఈఎంఐలు సకాలంలో చెల్లించలేకపోతున్నారు. వృద్ధాప్యంలో సీఎం జగన్ తమ జీవితాలతో చెలగాటమాడుతున్నారని పింఛనుదారులు మనోవేదనకు గురవుతున్నారు. తమ డిమాండ్లను పరిష్కరించాలని పింఛనుదారులు కలిస్తే మంత్రులు, ఎమ్మెల్యేలను అవహేళనగా మాట్లాడిన సందర్భాలూ ఉన్నాయి. జిల్లాలో సుమారు 20వేల మందికిపైగా పింఛనుదారులున్నారు. గతంలో చంద్రబాబు ప్రభుత్వం 70 ఏళ్లు పైబడిన పెన్షనర్లకు 10శాతం క్వాంటం, 75ఏళ్లు పైబడిన వారికి 15శాతం క్వాంటం పెన్షన్ ఇచ్చేవారు. జగన్ ప్రభుత్వం వచ్చిన తరువాత ఈ రెండింటినీ మూడుశాతం తగ్గించేశారు.



● విశ్రాంత ఉద్యోగులకు కరవైన మనశ్శాంతి ● ఒకటో తేదీన పెన్షన్ అన్నది గత కాలపు జ్ఞాపకం

● ఉద్యోగ విరమణ చేసినా అందని బెనిఫిట్స్ ● జగన్ జమానాలో లబోదిబోమంటున్న ప్రభుత్వ పెన్షనర్లు

ఇలాంటి సీఎంను ఎప్పుడూ చూడలేదు



పెన్షనర్ల డిమాండ్లను రాష్ట్ర ప్రభుత్వం అసలు పట్టించుకోవడంలేదు. నాలుగేళ్లుగా అనేక ఆర్థిక ప్రయోజనాలను అందకుండా చేశారు. గత ప్రభుత్వాలలో నెలాఖరున లేదా 1వ తేదీన పింఛను వేసేవారు. జగన్ వచ్చాక 15వ తేదీ దాటాల్సిందే. నా సర్వీసులో ఇలాంటి సీఎంను ఎప్పుడూ చూడలేదు. ఈ ఐదేళ్లలో చాలా కష్టాలు పడ్డాం.

- గోపాల్, ఏపీ ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం, జిల్లా అసోసియేట్ ప్రెసిడెంట్

తీవ్ర అన్యాయానికి గురయ్యాం



పాత బకాయిలు చెల్లించలేదు. ప్రభుత్వం చేతిలో అన్ని విధాల వంచనకు గురయ్యాం. డీఏలు ఇవ్వకుండానే పింఛనులో జమచేసినట్లు చూపి ఆదాయపన్ను వసూలు చేయడం అన్యాయం. పెన్షనర్లకు అన్ని రకాల వైద్య సేవలు కార్పొరేట్ స్థాయిలో అందిస్తున్నట్లు ప్రభుత్వం గొప్పలు చెబుతోంది. తీరా ప్రైవేటు ఆస్పత్రికి వెళితే పట్టించుకోవడంలేదు. ప్రభుత్వం మాపై వివక్ష చూపుతోంది.

- జయరామనాయుడు, ఏపీ ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం, రాష్ట్ర ఉపాధ్యక్షుడు

ప్రశాంతత కరువైంది



ఉద్యోగ విరమణ తరువాత ప్రశాంతంగా గడపాల్సిన వారు జగన్ ప్రభుత్వ పాలనలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఉద్యోగ సమయంలో జీతం నుంచి కొంతనగదును భవిష్యత్తు అవసరాల కోసం దాచుకుంటే రిటైరయ్యాక ప్రభుత్వం చెల్లించకపోవడ దుర్మార్గం. తక్షణమే చెల్లించాల్సిన బెనిఫిట్స్ కోసం నెలల తరబడి తిప్పించుకుంటున్నారు. ఇంత అన్యాయం ఎప్పుడూ చూడలేదు.

- కృపావరమ్మ, ఏపీఎస్‌జీఆర్ఈఏ మహిళా కార్యదర్శి

చాలా ఇబ్బందులు పడుతున్నాం



గతంలో ప్రతి నెలా 1వతేదీనే పింఛను వచ్చేది. దాని మీదే ఆధారపడి జీవిస్తున్నాను. మా అబ్బాయి ప్రైవేటు ఉద్యోగం చేస్తున్నాడు. నెలకు రూ.10వేలు మాత్రమే జీతం .దానికి నా పింఛను తోడైతే కుటుంబం గడిచేది. ప్రస్తుతం పింఛను జమ ఆలస్యం చేయడం వల్ల ఇబ్బంది పడుతున్నాం.

- మునస్వామి, ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగి

చెవిలో పువ్వు

ఏడుకొండల మీద ఆన.. ఏమైంది సాములా?

"మీరు న్యాయమైన హక్కు కోసం పోరాడుతున్నారు. ప్రభుత్వం మెడలు వంచి అయినా టైం స్కేలు తీసుకొస్తాం. లేదా మా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే మూడు నెలల్లో టైం స్కేల్ ఇస్తాం'

- 2019లో సమ్మె చేస్తున్న ఎస్వీయూ ఎన్ఎంఆర్ ఉద్యోగుల టెంట్‌లో భూమన కరుణాకరరెడ్డి, చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి.

సీన్ కట్ చేస్తే.. ప్రతిపక్షంలోఉండగా వీరోచితంగా పోరాడి వీరు టైం స్కేల్ తీసుకురాలేకపోయారు. మరి అధికారంలోకి వచ్చాక? ఇద్దరూ ఎమ్మెల్యేలే. పైగా సీఎంకి సన్నిహితులు కూడా. అయినా టైం స్కేల్ కత మరిచిపోయారు. ఆనాడు 300 మంది ఉద్యోగులను ఉద్దేశించి ఊగిపోతూ ప్రసంగించారు. ఆరునెలలు ఓపికపట్టండి వైసీపీ ప్రభుత్వం వచ్చిన మూడు నెలల్లో డిమాండ్లు పరిష్కరిస్తామని ఎదురుగా కనిపించే ఏడుకొండల సాక్షిగా ధాటీగా చెప్పి చప్పట్లు కొట్టించుకున్నారు. జేజేలు చెప్పించుకున్నారు. జగన్ సీఎం అయ్యాక వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. చెవిరెడ్డికి నాలుగు పదవులు వచ్చాయి. కరుణాకర్ రెడ్డికి జోడు పదవులు దక్కాయి. ఎన్ఎంఆర్‌లకు మాత్రం మొండి చేయి మిగిలింది.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి

వెంకటగిరి వర్తమానం

వెంకటగిరిలో వైసీపీ అభ్యర్థి నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి అసమ్మతి సెగలో ఉక్కిరిబిక్కిరవుతున్నారు. ఈసారి ఎన్నికల్లో ఆయన గట్టిగా ఎదురీదుతున్నారు. సామాన్యులతో కలవరనే ముద్ర పడిన ఈయన తమతో కూడా సఖ్యతగా లేరని స్వపక్ష నేతలు నెమ్మది నెమ్మదిగా దూరమవుతున్నారు. సొంత సామాజిక వర్గానికి చెందిన వ్యక్తులకేమండలాల పెత్తనం కట్టబెట్టడం పార్టీలో అసంతృప్తులను రాజేసింది. రామ్‌కుమార్‌రెడ్డికి టికెట్ ఇవ్వద్దని జిల్లా సెంట్రల్ బ్యాంకు మాజీ అధ్యక్షుడు మెట్టుకూరు ధనుంజయరెడ్డి, పార్టీ ఆవిర్భావం నుంచి జెండామోసిన కలిమలి రాంప్రసాద్‌రెడ్డి వంటి నేతలు బాహాటంగానే తిరుగుబాటు చేశారు. అసమ్మతి నేతలందరూ రామ్‌కుమార్‌రెడ్డికి టికెట్ ఇస్తే ఇండిపెండెంటుగా పోటీచేస్తామని హెచ్చరించినా ఆయనకే టికెట్ ఖరారు చేశారు. ఇవన్నీ వైసీపీ అభ్యర్థికి ప్రతికూలాంశాలుగా మారాయి.

- వెంకటగిరి, డక్కిలి

నేదురుమల్లికి అసమ్మతి ఉక్కపోత

● వైసీపీలో కలసిరాని నాయకులు ● ఆనం ప్రభావంతో చేజారిన క్యాడర్

● యువ మహిళా అభ్యర్థితో టీడీపీలో జోష్

వైసీపీకి ఆనం స్ట్రోక్

ఇక్కడ సిట్టింగ్ ఎమ్మెల్యే ఆనం రామనారాయణరెడ్డి వైసీపీని వీడి టీడీపీలో చేరడం వైసీపీ అభ్యర్థిపై తీవ్ర ప్రభావం చూపనుంది. 2019 ఎన్నికల్లో ఈయన 38 వేల పైచిలుకు ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు. ఆయన పార్టీ మారడంతో నియోజకవర్గంలోని ఆయన అనుచరులందరూ టీడీపీ గూటికి చేరారు. ఈ పరిణామం వైసీపీకి భారీగా నష్టం కలిగిస్తుందని భావిస్తున్నారు.



నేదురుమల్లి రామ్‌కుమార్ రెడ్డి



కురుగొండ్ల లక్ష్మీసాయిప్రియ

లక్ష్మీసాయిప్రియ అరంగేట్రం

టీడీపీ అభ్యర్థిగా బరిలో ఉన్న లక్ష్మీసాయిప్రియ మాజీ ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ కుమార్తె. ఈమె విద్యావంతురాలు కావడంతో మహిళలు, యువతను బాగా ఆకట్టుకుంటున్నారు. ఆమె తండ్రి స్థానికుడు కావడం, ఎమ్మెల్యేగా గతంలో ఆయన చేపట్టిన అభివృద్ధి పనులు ఈమె విజయానికి దోహదపడనున్నాయి. ఎన్నికల ప్రచారంలో లక్ష్మీసాయిప్రియ తనదైన శైలిలో దూసుకు వెళ్తున్నారు. ప్రజలను ఆకర్షించేలా.. ఆలోచింపచేసేలా ఆమె ప్రసంగం కొనసాగుతోంది. చిన్న వయస్సులోనే రాజకీయ రంగప్రవేశం చేసిన ఈమె పట్ల సానుకూలత కనిపిస్తోంది. ఇటీవల మండలాల్లో కొందరు ప్రభావిత నేతలు తమ అనుచరులతో పెద్ద ఎత్తున వైసీపీని వీడి టీడీపీలో చేరారు. ఈ పరిణామం టీడీపీ అభ్యర్థికి బలాన్ని చేకూర్చింది.

తిరుపతి చరిత్ర

అధినాయక ..వేదిక

● ఎన్టీఆర్, చిరంజీవికి పట్టం కట్టిన ఆధ్యాత్మిక నగరి

● చంద్రబాబు విద్యార్థి నేతగా ఎదిగింది ఇక్కడే

తిరుపతి.. తిరుమలేశుని దర్శనానికి ముఖద్వారం. దేశంలోనే అతిపెద్ద ఆధ్యాత్మిక నగరం. మన రాష్ట్రం నుంచే కాదు దేశవ్యాప్తంగా అనునిత్యం వేలాది మంది దర్శించే ప్రాంతమిది. ఏడు కొండలవాడిని దర్శించుకోవాలంటే ఈ నగరంలో అడుగు పెట్టాల్సిందే. పేరులోనే పవిత్రత ఉట్టిపడే తిరుపతి అసెంబ్లీ నియోజకవర్గం విశేషాలు పరికిస్తే.. 1955లో తిరుపతి, రేణిగుంట మండలాల (తిరుమలతో కలిపి)తో అసెంబ్లీ నియోజకవర్గంగా ఏర్పాటైంది. ఇప్పటివరకు 16 సార్లు ఎన్నికలు జరిగాయి.

● అగ్రనేతలకు వేదిక

టీడీపీ వ్యవస్థాపకుడు దివంగత ఎన్టీఆర్ మొదటిసారి తిరుపతినుంచే పోటీ చేసి గెలుపొందారు. ప్రజారాజ్యం పార్టీ తిరుపతిలోనే పురుడుపోసుకుంది. చిరంజీవి కూడా ఇక్కడనుంచే ఎమ్మెల్యేగా గెలుపొందారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తిరుపతిలోనే రాజకీయ పాఠాలు నేర్చుకున్నారు.

ఎమ్మెల్యేలు

1955	ఆర్.నాదముని రెడ్డి	కాంగ్రెస్
1962	ఆర్.నాదముని రెడ్డి	కాంగ్రెస్
1967	ఎ.ఈశ్వర్ రెడ్డి	స్వతంత్ర
1972	వి.శిఖామణి	కాంగ్రెస్
1978	ఎ.ఈశ్వరరెడ్డి	కాంగ్రెస్(ఐ)
1983	ఎన్టీ రామారావు	టీడీపీ
1983	(ఉప ఎన్నిక) కె.శ్యామల	టీడీపీ
1985	మబ్బు రామిరెడ్డి	కాంగ్రెస్
1989	మబ్బు రామిరెడ్డి	కాంగ్రెస్
1994	మోహన్	టీడీపీ
1999	చదలవాడ కృష్ణమూర్తి	టీడీపీ
2004	ఎం.వెంకటరమణ	కాంగ్రెస్
2009	కె.చిరంజీవి	ప్రజారాజ్యం
2012	(ఉప ఎన్నిక)కరుణాకర్ రెడ్డి	వైసీపీ
2014	ఎం.వెంకటరమణ	టీడీపీ
2015	(ఉప ఎన్నిక) సుగుణమ్మ	టీడీపీ
2019	కరుణాకర్ రెడ్డి	వైసీపీ

ప్రస్తుతం
మండలాలు: తిరుపతి అర్బన్
ఓటర్ల సంఖ్య: 3,01,041
పురుషులు: 1,49,160
స్త్రీలు: 1,51,846
ఇతరులు: 35

- తిరుపతి, ఆంధ్రజ్యోతి



● చెప్పాడంటే.. చేయడంతే!

ఈ వంతెన ఆరు నెలల్లో పూర్తి చేసేస్తా

● గూడూరులో గాల్లో కలిసిపోయిన జగన్ హామీ



గూడూరులో అసంపూర్తిగా వున్న రైల్వే ఓవర్ బ్రిడ్జి



రైల్వే క్రాసింగ్ గేటు వద్ద నిరీక్షిస్తున్న వాహనదారులు

ఎన్నో ఏళ్లుగా ఉన్న అసంపూర్తిగా ఉన్న ఈ వంతెన (ఆర్వోబీ)ను అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లో పూర్తి చేసేస్తా.

- 2018 జనవరి 28న పాదయాత్రగా గూడూరు వచ్చిన నాటి విపక్ష నేత జగన్ ఇచ్చిన హామీ ఇది. ఏడాదిన్నర తర్వాత ఆయన ముఖ్యమంత్రి అయ్యారు. చూస్తుండగానే పదవీకాలం ముగిసింది. ఆయన ఇచ్చిన హామీ గాల్లో కలిసిపోయింది. మళ్లీ ఎన్నికల ప్రచారంలో గూడూరుకు వస్తే దీనికి ఏం చెబుతారో? ఇంకే హామీ ఇస్తారోనంటూ స్థానికులు వ్యాఖ్యానిస్తున్నారు.

గూడూరు నడిబొడ్డున ఉన్న గూడూరు-చెన్నై, గూడూరు-తిరుపతి రైల్వే ట్రాక్‌లు పట్టణాన్ని వన్ టౌన్, టూ టౌన్‌గా విభజిస్తున్నాయి. రైల్వే జంక్షన్ కావడంతో రైళ్ల రాకపోకలు అధికం. రెండుట్రాక్‌లపైనా గేట్లు వేస్తుండటంతో అటు ఇటు రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతోంది. దీనికి పరిష్కారంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 2010లో రైల్వే ఓవర్ బ్రిడ్జి మంజూరు చేశాయి. రైల్వే శాఖ రూ.16 కోట్లు, రాష్ట్ర ప్రభుత్వం రూ.23 కోట్లు విడుదల చేశాయి. ఐసీఎస్ రోడ్డులోని ఎస్ఎంజీ పాఠశాల నుంచి మొదలయ్యే ఆర్వోబీ రెండు మార్గాలుగా విడిపోయి ఒకటి అడవయ్యకాలనీ వద్ద.. మరొకటి టూ టౌన్‌లోని సిరామిక్ కళాశాల వద్ద రోడ్డును కలవాలి. 2011 మార్చిలో పనులు మొదలయ్యాయి. రైల్వే శాఖ ఇచ్చిన రూ. 16 కోట్లతో రెండు ట్రాక్‌లపై ఆర్వోబీ నిర్మాణం పూర్తయింది. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన రూ.23 కోట్లు ట్రాక్‌లకు ఇరువైపులా బ్రిడ్జి కొనసాగింపు పనులకు చాలక ఆగిపోయాయి. భూసేకరణ, ఆర్వోబీ కోసం తొలగించిన భవనాలు, ఇళ్లకు పరిహారంతో పాటు పెరిగిన ఖర్చులకు అనుగుణంగా మళ్లీ ప్రభుత్వం 2015లో రూ.40 కోట్లు అదనంగా మంజూరు చేసింది. రూ.36 కోట్లతో ఐదుసార్లు టెండర్లు పిలిచినా కాంట్రాక్టర్లు ముందుకు రాలేదు. ఆరు నెలల్లో పూర్తి చేసేస్తానంటూ గత ఎన్నికల్లో ఓట్లు వేయించుకున్న జగన్.. ఐదేళ్లుగా పట్టించుకోలేదు.

- గూడూరు

వాట్సప్ కాల్ అయితేనే..


● గాసిప్

వాట్సప్ కాల్ అయితేనే మాట్లాడతాం. లేదంటే లేదంటూ తెగేసి చెప్పేస్తున్నారు నగరి నియోజకవర్గ వైసీపీ అసమ్మతి నేతలు. ఏం మాట్లాడితే ఎవరు రికార్డుచేసి అగ్ర నాయకులకు చేరవేస్తారేమోనని హడలిపోతున్నారు. ఎందుకొచ్చిన గొడవని వాట్సప్ కాల్‌లో మాత్రమే మాట్లాడుతున్నారు. ఇటీవల పుత్తూరు మున్సిపల్ కౌన్సిలర్లు అసంతృప్తిగా ఉన్నట్లు పెద్దలకు ఉప్పు అందింది. దీంతో తమ నమ్మకస్తుడైన మరో కౌన్సిలర్‌ను చక్కదిద్దమని పురమాయించారు. ఆ కౌన్సిలర్ పలుమార్లు ఫోన్ చేస్తున్నా అసంతృప్త కౌన్సిలర్లు స్పందించలేదు. వాట్సప్ కాల్‌లో మాత్రమే మాట్లాడతామని తెగేసి చెప్పారు. సన్నిహితులతోనూ చాలామంది వాట్సప్ కాల్స్ ద్వారానే మాట్లాడుతున్నారు.

- పుత్తూరు అర్బన్

ఇదీ మందు




● సౌరముద్రలు

నాయకుడంటే ఈయన!

రెండేళ్లు సర్పంచ్‌గా చేస్తేనే భూములు మేడలు ఎనకేసుకునే నాయకులున్న కాలంలో రెండు చేతులూ జోడించి గుర్తు చేసుకోవాల్సిన పేరు టీసీ రాజన్. ఎన్జీ రంగా అనుచరుడు అయిన ఈయన 1967లో పలమనేరు నుంచి స్వతంత్ర్య పార్టీ అభ్యర్థిగా పోటీచేసి కాంగ్రెస్ అభ్యర్థి బీఎల్ఎన్ నాయుడిపై 9561 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. ఐదేళ్లు శాసనసభ్యుడిగా పనిచేసిన రాజన్‌కి సెంటు భూమి లేదు. సొంతంగా జానెడు ఇల్లు లేదు. బెంగళూరులో, హైదరాబాద్‌లో, తాడేపల్లిలో ప్యాలెస్‌లు నిర్మించుకునీ పేదలమంటూ చెప్పకునే నాయకులు సిగ్గుపడేలా ఆదర్శంగా జీవిస్తున్నారు రాజన్. స్వాతంత్ర్య సమరయోధుడు కూడా అయిన ఈయన ప్రభుత్వ పెన్షన్‌తోనే సరిపెట్టుకుంటున్నారు. రాజన్ వయసు 107 ఏళ్లు. భార్య చనిపోయి పదేళ్లయింది. ప్రస్తుతం బెంగళూరులోని చిన్న కుమారుడి దగ్గర ఉంటున్నారు. నెలరోజుల క్రితం రోడ్డుప్రమాదంలో ఆయన చిన్నకుమారుడు, కోడలు దుర్మరణం చెందారు.

- పలమనేరు

అధికారం ఎటుంటే అటు


● జంపింగ్ జపాంగ్స్

అధికారం ఎటుంటే అటు వెళ్లడం.. ఏ పార్టీ అధికారంలోకి వస్తుందో ఊహించి ముందుగానే ఫిరాయించడం కొందరికి అలవాటు. ఇలా చిత్తూరులోని ఇద్దరు నేతలు పార్టీ కండువాలు మార్చేయడం చర్చనీయాంశంగా మారింది. గతంలో ఆ ఇద్దరు టీడీపీలో కార్పొరేటర్లుగా ఎన్నికై ఐదేళ్లు కొనసాగారు. టీడీపీ అధికారం కోల్పోయాక వెంటనే పార్టీని వీడి.. వైసీపీ తీర్థం పుచ్చుకున్నారు. అక్కడ నగరపాలక సంస్థలో కో- ఆప్షన్ సభ్యులుగా అవకాశం దక్కించుకున్నారు. నాలుగేళ్లకుపైగా ఆ పదవుల్లో కొనసాగిన వీరు.. వారం కిందట అధికార పార్టీని వీడి టీడీపీలో చేరారు. ఈ సారి ఎన్నికల్లో టీడీపీ కూటమి అధికారంలోకి వస్తుందన్న బలమైన ప్రచారం ఉండటం.. వైసీపీ ప్రభుత్వంపై ప్రజల్లో ఉన్న వ్యతిరేకతను పసిగట్టి వీరు ముందుగానే సొంతగూటికి చేరారని స్థానికంగా చర్చ జరుగుతోంది.

- చిత్తూరు

తలమీద చేయి పెట్టారు. మీ జీవితాల్లో వెలుగులు నింపుతానని చెప్పారు. అధికారంలోకి తానొస్తే తెలంగాణకంటే రూ.వెయ్యి ఎక్కువ జీతం ఇస్తానంటూ నమ్మించారు. ఆ మాటలకు పొంగిపోయిన అంగన్వాడీలు.. గత ఎన్నికల్లో జగన్‌కు వెన్నంటి నిలిచారు. అధికారంలోకి వచ్చాక.. అన్ని వర్గాల్లాగే వీరినీ మోసం చేశారు.

- చిత్తూరు


తమ డిమాండ్లు నెరవేర్చాలంటూ చిత్తూరులో ఆందోళన చేస్తున్న అంగన్వాడీలు (ఫైల్ ఫొటో)

నమ్మించి.. వంచించి..!

● అంగన్‌వాడీలకు ఇచ్చిన హామీలు నెరవేర్చని జగన్ ● ఆందోళన చేస్తే కఠినంగా అణచివేత

ప్రతిపక్ష నాయకుడిగా పాదయాత్ర చేసిన వైఎస్ జగన్.. అందరికిలాగే చిరువేతన జీవులైన అంగన్వాడీలకూ ఎన్నో హామీలిచ్చారు. ఏళ్ల తరబడి పనిచేస్తున్న సిబ్బందికి అండగా ఉంటానన్నారు. పెండింగ్ సమస్యలను పరిష్కరించడంతో పాటు జీతాన్ని పెంచుతామన్నారు. పొరుగున ఉన్న తెలంగాణ రాష్ట్రం అక్కడి అంగన్వాడీలకు ఇచ్చే జీతంపై అదనంగా రూ.వెయ్యి ఇస్తానన్నారు. ఇలాంటి హామీలతో అంగన్వాడీల ఓట్లు వేయించుకున్నారు. అధికారంలోకి వచ్చాక నిర్లక్ష్యం చూపారు. జగన్ అధికారంలోకి రాకముందు అంగన్వాడీ వర్కర్లకురూ. 10,500, ఆయాలకు రూ.6వేలు ఉండేది. ఈ ఐదేళ్లలో కేవలం రూ.వెయ్యి మాత్రమే పెంచారు. తెలంగాణలో గత ప్రభుత్వం ఇచిచన పీఆర్‌సీతో అక్కడి సిబ్బందికి వేతనాలు బాగా పెరిగాయి. ప్రస్తుతం ఆ రాష్ట్రంలో వర్కర్‌కు రూ.13600, ఆయాలకు రూ.10వేలు ఇస్తున్నారు. జగన్ ఇచ్చిన హామీ ప్రకారమైతే ఇక్కడ అంగన్వాడీ కార్యకర్తలకు రూ.14,600, ఆయాలకు రూ.11 వేల జీతం ఇవ్వాలి. కానీ ఇప్పుడు జగన్ ప్రభుత్వం ఇచ్చేది అంగన్వాడీ వర్కర్‌కు రూ.11500, ఆయాకు రూ.7వేలు మాత్రమే. ఇలా జీతం విషయంలో జగన్ మాట తప్పారు. ఇక, రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ పెంచాలని, మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మార్చాలని, పనిభారాన్ని తగ్గించాలని, విధుల్లో చనిపోతే కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని, మట్టి ఖర్చులకు ఆర్థికసాయం చేయాలని అంగన్‌వాడీ వర్కర్లు కోరారు. వీటన్నింటిపై ఆందోళన చేస్తే తొలగింపుల పేరిట ప్రభుత్వం బెదిరించింది. వీరి ఉద్యమాన్ని ఉక్కుపాదంతో అణచివేసింది. చివరకు వీరి సమస్యలను అధ్యయనం చేయడానికి కమిటీ వేస్తామని చెప్పింది. నాలుగు నెలలవుతున్నా ఇంతవరకు అతీగతీ లేదు. ఇప్పుడు మళ్లీ ఎన్నికలు వచ్చాయి. దగా పడిన అన్ని వర్గాల్లాగే వీరూ ఈ ఎన్నికల్లో వైసీపీ ప్రభుత్వానికి గుణపాఠం చెప్పడానికి 'సిద్ధం'గా ఉన్నారు.



ప్రభుత్వం దగా చేసింది



ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలని నిరవధిక సమ్మె చేసినా ప్రయోజనం లేకపోయింది. ఏళ్ల తరబడి పనిచేస్తున్న మమ్మల్ని వైసీపీ ప్రభుత్వం గుర్తించకపోవడం దారుణం. 12 డిమాండ్లను ప్రభుత్వం ముందు పెడితే ఎనిమిదింటినే ఒప్పుకొన్నారు. వయోపరిమితికి సంబంధించి మాత్రమే జీవో తప్ప మిగతావన్నీ నీటి మాటలుగానే మిగిలిపోయాయి.

- సుజని, జిల్లా అధ్యక్షురాలు, అంగన్‌వాడీ, హెల్పర్స్ యూనియన్

కోడ్ పేరుతో కిట్ ఇవ్వలేదు



ఎన్నికల కోడ్ పేరుతో మూడు నెలలుగా గర్భవతులు, బాలింతలకు కిట్‌ను ఇవ్వడం లేదు. గతంలో చాలా మంది కిట్ ద్వారా రాగి పిండి, అటుకలు, బెల్లం, ఖర్జూరం, చిక్కీలను తీసుకునే వారు. కోడ్ నెపంతో ప్రభుత్వం వీటిని పంపిణీ చేయడం లేదు. గర్భవతులు, బాలింతలకు అందే పౌష్టికాహారం అందడం లేదు.

- షకీలా, జిల్లా కార్యదర్శి, అంగన్‌వాడీ యూనియన్

మెయిన్ సెంటర్లుగా మార్చాలి



మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మార్చాలి. చాలా మంది అర్హత ఉండి కూడా ఏళ్ల తరబడి ప్రమోషన్ పొందలేకపోతున్నారు. వారి కుటుంబం ఆర్థికంగా ఇబ్బందులు పడుతోంది. సమ్మె చేసిన సమయంలో అధికారుల ఒత్తిడి, పనిలేకపోతే జీవనం పోతుందనే భయంతో జిల్లాలో కొంత మంది వరకు చనిపోయారు. వారి కుటుంబాల్లో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలి.

- జ్యోతి, డివిజన్ అధ్యక్షురాలు, పలమనేరు

● కుప్పం చరిత్ర

ద్రావిడ సంగమం



తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల సరిహద్దులు కలిగివున్న నియోజకవర్గం కుప్పం. ద్రావిడ సంస్కృతీ సంప్రదాయాల మేళవింపు ఇక్కడ కనిపిస్తుంది. విసిరేసినట్లు ఉండే ఈ నియోజకవర్గం చంద్రబాబు రాకతో మారిపోయింది. ఎన్టీయార్ ముందుచూపుకు నిదర్శనంగా ద్రావిడ విశ్వవిద్యాలయం వెలిసింది. తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడును వరుసగా 7 సార్లు గెలిపించి, మూడుసార్లు ముఖ్యమంత్రి నియోజకవర్గం అనే ఘనత దక్కించుకుంది.

నియోజకవర్గం ఏర్పడిన సంవత్సరం: 1955

ఇప్పటిదాకా జరిగిన ఎన్నికలు: 13

ఎమ్మెల్యేలు

1955- డి.రామబ్రహ్మం- కాంగ్రెస్
1962- ఏపీ వజ్రవేలుశెట్టి- సీపీఐ
1967- డి.వెంకటేశం- స్వతంత్ర
1972- డి.వెంకటేశం- స్వతంత్ర
1978- బీఆర్ దొరస్వామినాయుడు- కాంగ్రెస్
1983, 1985- ఎన్.రంగస్వామినాయుడు- టీడీపీ
1989, 1994, 1999, 2004, 2009, 2014, 2019
- నారా చంద్రబాబునాయుడు- టీడీపీ

ప్రస్తుతం

మండలాలు: కుప్పం, గుడుపల్లె, శాంతిపురం, రామకుప్పం
ఓటర్ల సంఖ్య: 2,23,104
పురుషులు: 1,11,231
స్త్రీలు: 1,11,855
ఇతరులు: 18
పోలింగ్ బూత్‌ల సంఖ్య: 175



- కుప్పం

నగరిలో మట్టి మాఫియా

గుట్టల్ని మింగేస్తున్న అవినీతి 'అనకొండలు' వారు. అధికారం అండగా చెలరేగిపోతూ.. కొండల్ని పిండి చేస్తున్నారు. మట్టి నుంచి డబ్బు పిండుతున్నారు. ఇలా ఐదేళ్లుగా నగరిలో మట్టిమాఫియా చెలరేగిపోతోంది. ప్రకృతి సంపదను కొల్లగొడుతోంది.

- నగరి


● ఇష్టారాజ్యంగా గుట్టలు తవ్వేస్తున్నారు ● తమిళనాడుకు మట్టి తరలిస్తున్నారు

నగరి నియోజకవర్గంలో అధికార పార్టీ నేతల అవినీతి, అక్రమాలకు అంతూపొంతూ లేకుండాపోయింది. మట్టిపైనా వీరి కన్ను పడింది. పొరుగున తమిళనాడులో మట్టికి డిమాండు ఉండడంతో అధికార పార్టీ నాయకుల కనుసన్నలలో మాఫియా రెచ్చిపోతోంది. నగరి, విజయపురం మండలాల్లో అనుమతులు లేకుండానే కొండలు తవ్వి తరలించేస్తున్నారు. విజయపురం మండలంలో మంత్రి రోజా సోదరుల సహకారంతో తాత్కాలిక అనుమతులు చూపిస్తూ ఏళ్ల తరబడి మట్టి తరలిస్తున్నారనే ఆరోపణలున్నాయి. తడుకు రెవెన్యూలో సర్వే నంబరు 89-1, 89-2లలో అనుమతి లేకుండానే తవ్వేస్తున్నారు. సత్రవాడ 245 సర్వే నంబరులో లీజుకు తీసుకున్నా పరిమితికి మించి తరలిస్తున్నారు. కడపకు చెందిన సుదర్శనరెడ్డి పేరుతో ఈ క్వారీ నడుస్తోంది. క్వారీ నడిపేవారు మంత్రి కోటా కింద రోజూ 50 శాతం కచ్చితంగా చెల్లించాల్సి ఉంటుందన్న ఆరోపణలున్నాయి.

మరో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి సహకారంతో సత్యవేడుకు చెందిన వైసీపీ నాయకులు పాతార్కాడు, మహరాజపురం, శ్రీహరిపురం రెవెన్యూ పరిధిలో తాత్కాలిక అనుమతులతో మట్టి తరలిస్తున్నారు. ఈ తతంగమంతా రెవెన్యూ అధికారులకు తెలిసినా అధికార పార్టీ నేతల అండదండలు ఉండడంతో మిన్నకుండిపోతున్నారు.

- నగరి


● అనకొండలు



విజయపురం మండలం శ్రీహరిపురంలో భారీ వాహనాలతో మట్టి తరలింపు (ఫైల్‌ఫొటో)
- సత్రవాడలో కొండను తవ్వేస్తున్నారిలా..

కంచుకోటలో పట్టు బిగించిన టీడీపీ

పలమనేరు వర్తమానం

● ఐదేళ్లుగా ప్రజల మధ్యనే అమరనాథరెడ్డి
● వైసీపీ నుంచి పెరిగిన చేరికలు
● పలమనేరులో అధికార పార్టీ ఆగడాలపై వ్యతిరేకత

పలమనేరు, ఏప్రిల్ 19: గత ఎన్నికల్లో కోల్పోయిన తమ కంచుకోట పలమనేరు నియోజకవర్గంలో ఈసారి పాగా వేసేందుకు టీడీపీ కృతనిశ్చయంతో అడుగులు వేస్తోంది. 2019 ఓటమి నుంచి ఇప్పటి వరకు మాజీ మంత్రి అమరనాథరెడ్డి నియోజకవర్గ ప్రజల మధ్య నే ఉంటున్నారు. వారి సమస్యల పరిష్కారానికి కృషిచేస్తూనే వైసీపీ ప్రజావ్యతిరేక కార్యక్రమాలను గట్టిగా ఎండగడుతున్నారు. ఇసుక, క్వారీలలో అక్రమాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లడంలో సఫలీకృతమయ్యారు. మండలాల్లో గ్రాఫ్‌ను బాగా పెంచుకొన్నారు. గత ఎన్నికల్లో వైసీపీ కోసం పనిచేసిన ప్రజాప్రతినిధులను టీడీపీ వైపు మళ్లించగలిగారు. వైసీపీకి పెద్దదిక్కుగా ఉండే మాజీ ఎమ్మెల్సీ రెడ్డెప్పరెడ్డి సోదరుడు విజయభాస్కరరెడ్డి, ఎమ్మెల్యే వెంకటేగౌడ మధ్య ఏర్పడిన అంతరం అమరనాథరెడ్డికి అనుకూలంగా మారిందని సమాచారం. ఈ విషయంలో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీలు రెడ్డెప్ప, మిధున్‌రెడ్డిలు చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. విజయభాస్కరరెడ్డి టీడీపీకి పనిచేయకపోయినా ఆయన వైసీపీపై సానుకూలంగా లేకపోవడం అమరనాథరెడ్డికి కలిసొచ్చే అంశమే. పలమనేరు మండలంలో పలువురు వైసీపీ నాయకులు టీడీపీలో చేరారు. మున్సిపాలిటీ కౌన్సిలర్ కూడా టీడీపీ కండువా కప్పుకున్నారు.



అమరనాథరెడ్డి

అక్రమాలపై ప్రజా వ్యతిరేకత

కౌండిన్య నది నుంచి పలమనేరు వైసీపీ నాయకులు అధికార దర్పంతో ఇసుక తరలించడాన్ని ప్రజలు నిరసిస్తున్నారు. ఇళ్ల నిర్మాణంలో పేదలను అధికార పార్టీనేతలు వేధించడం, గంటావూరు ఇందిరమ్మ కాలనీలో స్థలాల్లో అక్రమాలకు పాల్పడటం స్థానికంగా వైసీపీపై వ్యతిరేకత పెంచింది. గంగవరం మండల వైసీపీ నాయకులపై పలు అవినీతి ఆరోపణలు వచ్చాయి. పలమనేరులోని ఖాళీస్థలాల్లో వైసీపీవారు కబ్జాలకు పాల్పడటం టీడీపీకి అనుకూలిస్తోంది. గత ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థికి 1800 ఓట్లు వచ్చాయి. వైఎస్ షర్మిల ప్రచార ప్రభావంతో ఈసారి తమకు ఓట్లు పెరుగుతాయని కాంగ్రెస్ వర్గాలు విశ్వసిస్తున్నాయి. ఈ ఓట్ల ప్రభావం తమను దెబ్బ తీస్తుందని వైసీపీ నాయకులు ఆందోళన చెందుతున్నారు. వైసీపీకి ఓటు బ్యాంకుగా పరిగణించే ముస్లిం ఓటర్లను అమరనాథరెడ్డి ఆకర్షించడంలో ముందున్నారు. జనసేన యువకులు అమరనాథరెడ్డి ప్రచార కార్యక్రమాల్లో బలంగా నిలుస్తున్నారు. వైసీపీ సంక్షేమ పథకాలే తనను గెలిపిస్తాయని వెంకటేగౌడ నమ్ముతున్నారు.


వెంకటేగౌడ

నేను సైతం


బంగారుపాళ్యం మండలం టేకుమందలో కరపత్రాలు పంచుతున్న విక్రమ్ చౌదరి

● టీడీపీ ప్రచార సమరంలో యువ ఎన్ఆర్ఐ

మాతృగడ్డపై మమకారానికి తోడు తాను అమితంగా ఇష్టపడే విజనరీ నేతల స్ఫూర్తిగా 'నేను సైతం' అంటూ ప్రచార సమరంలో పాలు పంచుకుంటున్నారో యువ పారిశ్రామికవేత్త. చిత్తూరు జిల్లా బంగారుపాళ్యం మండలం నలగాంపల్లెకు చెందిన ఎన్‌పీ విక్రమ్ చౌదరి అమెరికాలోని న్యూజెర్సీలో మార్కెటింగ్ బిజినెస్ చేస్తుంటారు. ఏడాదికి తన కంపెనీ ద్వారా రూ. 250 కోట్ల టర్నోవర్ చేస్తుంటారు. పుట్టిన గడ్డకు ఏదో రూపంలో సేవ చేయాలనే తలంపుతో నాలుగేళ్లుగా టీడీపీ పటిష్టతకు కృషిచేస్తూనే ఇక్కడ యువతకు చెన్నై, బెంగళూరు, హైదరాబాదులతో పాటు అమెరికాలో కూడా ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నారు. ఇందుకోసం బెంగళూరులో టీమును ఏర్పాటు చేశారు. గత ఆరునెలల్లో 300 మంది నిరుద్యోగులకు ఉపాధి కల్పించినట్లు విక్రమ్ చౌదరి చెప్పారు. భవిష్యత్ విజన్ ఉన్న టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడు, లోకేష్ తనకు ఆదర్శమంటారీయన. విదేశాల్లో నెల రోజులుండి, మరో నెల రోజులు పూతలపట్టు నియోజకవర్గంలో పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటున్నారు. ప్రధానంగా యువతను చైతన్యపరుస్తున్నారు. టీడీపీ అధికారంలోకి వస్తే నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలతో పాటు రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని గ్రామాల్లో బలంగా ప్రచారం చేస్తున్నారు.

- చిత్తూరు

ఆదిమూలం నామినేషన్ దాఖలు



రిటర్నింగ్ అధికారికి నామినేషన్ పత్రాలు అందజేస్తున్న ఆదిమూలం

సత్యవేడు, ఏప్రిల్ 19: సత్యవేడు అసెంబ్లీ స్థానానికి టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కోనేటి ఆదిమూలం శుక్రవారం నామినేషన్ దాఖలు చేశారు. తొలుత స్థానిక సుబ్రహ్మణ్యస్వామి ఆలయంలో నామినేషన్ పత్రాలు ఉంచి పూజలు నిర్వహించారు. అక్కడి నుంచి టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలతో ర్యాలీగా బయలుదేరి నామినేషన్ కేంద్రానికి చేరుకున్నారు. నామినేషన్ కేంద్రంలో ఆర్వో నరసింహులు, ఏఆర్వో రామాంజనేయులుకు రెండు సెట్ల నామినేషన్ పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో శ్రీకాళహస్తి మాజీ ఎమ్మెల్యే ఎస్సీవీ నాయుడు, మాజీ ఎంపీపీ మస్తాన్, జనసేన నియోజకవర్గ అధ్యక్షుడు లావణ్యకుమార్, టీడీపీ నాయకులు ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, సతీష్ నాయుడు, రోశయ్య, పరమశివం తదితరులు పాల్గొన్నారు. అదే విధంగా ఇండిపెండెంట్ అభ్యర్థిగా జేడీ రాజశేఖర్ తరపున ఆయన సతీమణి సుగుణమ్మ కుమార్తె మౌనిక నామినేషన్ దాఖలు చేశారు.

నేడు సత్యవేడులో చంద్రబాబు పర్యటన

సత్యవేడు, ఏప్రిల్ 19: టీడీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం సత్యవేడులో పర్యటించనున్నారు. సాయంత్రం సత్యవేడు టవర్‌క్లాక్ వద్ద చంద్రబాబు రోడ్‌షో జరగనుందని పార్టీ వర్గాలు తెలిపాయి. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లు ఎమ్మెల్యే అభ్యర్థి ఆదిమూలం ఆధ్వర్యంలో కొనసాగుతున్నాయి. దళవాయి, అగ్రహారం సమీపంలో హెలిప్యాడ్ ఏర్పాటు చేశారు. శనివారం సాయంత్రం 4.50 నిమిషాలకు చంద్రబాబు నాయుడు పొదలకూరు మర్రిపల్లి సెంటర్ నుంచి హెలికాప్టర్‌లో బయలుదేరి 5.20 నిమిషాలకు సత్యవేడు పట్టణం దళవాయి అగ్రహారం వద్ద ఏర్పాటు చేసిన హెలిప్యాడ్‌కు చేరుకుంటారు. అక్కడి నుంచి టవర్‌క్లాక్ వద్దకు చేరుకుని 6 గంటల నుంచి 7.30 గంటల వరకు రోడ్‌షోలో ప్రజలనుద్దేశించి ప్రసంగించనున్నారు. అనంతరం తిరుపతికి వెళ్తారు.

బీసీల అభ్యున్నతే టీడీపీ లక్ష్యం



సమావేశంలో మాట్లాడుతున్న రిషితారెడ్డి

తొట్టంబేడు, ఏప్రిల్ 19: బీసీల అభ్యున్నతే టీడీపీ లక్ష్యమని శ్రీకాళహస్తి ఎమెల్యే అభ్యర్థి బొజ్జల సుధీర్‌రెడ్డి సతీమణి రిషితారెడ్డి అన్నారు. మండలంలోని కల్లిపూడి గ్రామంలో బీసీలతో ఆత్మీయ సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ శ్రీకాళహస్తి నియోజకవర్గంలో గోపాలన్న బీసీలకు ఉన్నత స్థానం కల్పించారని గుర్తుచేశారు. రానున్న టీడీపీ ప్రభుత్వంలో 18సంవత్సరాలు నిండిన ప్రతి మహిళకూ రూ.1500నగదు, ప్రతి ఇంటికీ మూడు గ్యాస్ సిలిండర్లు, చదువుకునే ప్రతి బిడ్డకూ ఏడాదికి రూ.15వేల నగదు ఇవ్వనున్నట్లు తెలిపారు. టీడీపీకి ఓటు వేసి సుధీర్‌రెడ్డిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గాలి చలపతినాయుడు, మాజీ జడ్పీటీసీ వెంకటాచలం, మునిరాజ నాయుడు, శోభన్ నాయుడు, మురళీ నాయుడు తదితులు పాల్గొన్నారు.

సూపర్ సిక్స్ పథకాలపై ప్రచారం

ఏర్పేడు, ఏప్రిల్ 18: మండలంలోని బండారుపల్లిలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి రెడ్డివారి గురవారెడ్డి శుక్రవారం ప్రచారం నిర్వహించారు. సూపర్‌సిక్స్ పథకాల గురించి వివరిస్తూ కరపత్రాలు అందజేశారు. టీడీపీ నాయకులు శివశంకర్‌రెడ్డి, సుబ్రహ్మణ్యం యాదవ్, దామోదర్‌రెడ్డి, ధనంజయులు, హరి, శివ, మునిరత్నం, తిరుపాల్, భక్తిరెడ్డి తదితరులు పాల్గొన్నారు. అలాగే మర్రిమంద, ఇసుకతాగేలి, మాధవమాల దళితవాడల్లో జడ్పీటీసీ కావేరి తిరుమలయ్య ప్రచారం నిర్వహించారు. ఎమ్మెల్యేగా బొజ్జల సుధీర్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. సుందర్‌బాబు, మునెయ్య, జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.

ఏకలవ్య గురుకుల పాఠశాల విద్యార్థి ప్రతిభ

బుచ్చినాయుడుకండ్రిగ, ఏప్రిల్ 19: కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న ప్రేరణ ఉత్సవ్ పోటీల్లో బీఎన్‌కండ్రిగ మండలంలోని ఏకలవ్య గురుకుల పాఠశాల 9వ తరగతి విద్యార్థి యువకిరణ్ నాయక్ ఉత్తమ ప్రతిభ కనపరిచినట్లు ఎంఈవో రవీంద్రనాథ్ తెలిపారు. త్వరలో గుజరాత్ రాష్ట్రంలో జరునున్న వకృత్వ పోటీలకు యువకిరణ్ ఎంపికయినట్లు ఆయన తెలిపారు.

దక్షిణ కాళికాదేవికి ప్రత్యేక పూజలు

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 19: శ్రీకాళహస్తి మండలం వేడాం గ్రామంలో వెలసిన దక్షిణ కాళికాదేవికి శుక్రవారాన్ని పురస్కరించకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం రాహుకాలం సమయంలో అర్చకులు అమ్మవారి మూలమూర్తిని పూజా ద్రవ్యాలతో అభిషేకించారు. అనంతరం నిమ్మకాయలు, పూలమాలతో సుందరంగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కలిగించారు. పట్టణంతో పాటు పలు గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. మహిళలు దీపాలు వెలిగించి హారతులు పట్టారు. ఆలయ నిర్వాహకులు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

కనకదుర్గమ్మకు విశేష పూజలు

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 19: ముక్కంటి ఆలయానికి అనుబంధంగా కనకాచలంపై వెలసిన కనకదుర్గమ్మకు శుక్రవారాన్ని పురస్కరించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాహుకాలం సమయంలో అమ్మవారి మూలమూర్తికి వివిధ పూజా ద్రవ్యాలతో విశేషంగా అభిషేకాలు చేశారు. మహిళలు పెద్ద సంఖ్యలో అమ్మవారికి దీపారాధన సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. అలాగే సామూహిక లలితా సహస్ర నామం పటించారు. అనంతరం అమ్మవారు ప్రత్యేక అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు.

శ్రీకాళహస్తి

సత్యవేడు

పోస్టల్ బ్యాలెట్ కోసం 22 లోగా పేర్లు నమోదు చేసుకోవాలి

పిచ్చాటూరు, ఏప్రిల్ 19: పోస్టల్ బ్యాలెట్ నమోదు చేసుకోవడానికి ఈ నెల 22న ఆఖరి తేదీ అని తహసీల్దార్ హుస్సేన్ సాహెబ్ తెలిపారు. పిచ్చాటూరు మండలానికి చెంది, ఇతర ప్రాంతాల్లో పనిచేస్తున్న ప్రభుత్వ ఉద్యోగులు ఓటరు కార్డు, ఐడీ ప్రూఫ్, అపాయింట్‌మెంట్ ఆర్డర్ కాపీతో ఈ నెల 22 లోగా స్థానిక రెవెన్యూ కార్యాలయంలో పేర్లు నమోదు చేసుకోవాలని తహసీల్దార్ కోరారు.

ఆగివున్న కారును ఢీకొన్న లారీ

వరదయ్యపాళెం, ఏప్రిల్ 19: ఆగివున్న కారును లారీ ఢీకొన్న ఘటన వరదయ్యపాళెం మండలంలోని చిన్నపాండూరు వద్ద జరిగింది. ఈ ప్రమాదంలో ఎవరికీ ఎలాంటి గాయాలు కాలేదు.

రేపు ఆదర్శ పాఠశాల ప్రవేశపరీక్ష

కేవీబీపురం, ఏప్రిల్ 19: ఆదర్శ పాఠశాలలో 6వ తరగతి ప్రవేశ పరీక్ష ఏప్రిల్ 21న నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ మోహన్‌రెడ్డి తెలిపారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు సంబంధిత వెబ్‌సైట్ నుంచి హాల్ టికెట్ డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. హాల్ టికెట్‌తో పాటు ఆధార్‌కార్డు జిరాక్సుతో 21వ తేదీ ఉదయం 8.30 గంటలకు పరీక్షకు హాజరుకావాలని కోరారు.

వైసీపీ స్మాష్: సుధీర్ రెడ్డి



ఎన్నికల ప్రచారం చేస్తున్న బొజ్జల సుధీర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఎస్సీవీ నాయుడు తదితరులు

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 19: అన్ని వర్గాల ప్రజలను దారుణంగా పీడించిన వైసీపీ వచ్చే ఎన్నికల్లో స్మాష్ కావడం తథ్యమని ఎన్డీఏ కూటమి శ్రీకాళహస్తి ఎమ్మెల్యే అభ్యర్థి బొజ్జల సుధీర్ రెడ్డి అన్నారు. శుక్రవారం ఉదయం పట్టణంలోని 14వ వార్డులో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. స్థానికులు గజమాలలు, శేష వస్త్రాలతో సత్కరించి మంగళ హారతులతో స్వాగతం పలికారు. తమ సమస్యలను విన్నవించారు. మౌలిక సమస్యలను కూడా పరిష్కరించని వైసీపీ వచ్చే ఎన్నికల్లో తుడిచిపెట్టుకుపోవడం ఖాయమని సుధీర్ రెడ్డి ధైర్యం చెప్పారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి ఉమ్మడి ప్రభుత్వం అమలు చేయబోయే సూపర్ సిక్స్ పథకాలు, వాటి ద్వారా జరగబోయే మేలును వివరించారు. సైకిల్ గుర్తుపై ఓటు వేసి తనను ఎమ్మెల్యేగా గెలిపించాలని అభ్యర్థించారు. తన తండ్రి గోపాలకృష్ణారెడ్డి తరహాలో పట్టణాన్ని ప్రశాంతంగా ఉంచడంతో పాటు అన్ని విధాల అభివృద్ధి చేస్తానని భరోసా ఇచ్చారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ... వైసీపీ నేతలు వలంటీర్లను బెదిరించి తమ స్వార్థ ప్రయోజనాల కోసం బలవంతంగా రాజీనామాలు చేయించడం బాధాకరమన్నారు. దుర్మార్గుల బెదిరింపులకు నిస్వార్థంగా సేవలు అందించే వలంటీర్లు భయపడాల్సిన అవసరం లేదన్నారు. వలంటీర్లకు చంద్రబాబు నాయుడు అండగా ఉండి గౌరవ వేతనం రెట్టింపు చేస్తారని భరోసా ఇచ్చారు. ఇక సాయంత్రం 31, 32వ వార్డుల్లో ప్రచారం నిర్వహించారు. విజయగణపతి ఆలయం నుంచి మాజీ ఎమ్మెల్యే ఎస్సీవీ నాయుడుతో కలిసి ప్రచారం ప్రారంభించారు. స్థానికులు ఇద్దరు నేతలను గజమాలలతో సత్కరించారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి ప్రాచారం చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఎస్సీవీ దిలీప్, సత్రవాడ ప్రవీణ్, విజయ్ కుమార్, ప్రకాష్ నాయుడు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు చంద్రప్ప, నాయకులు కండ్రిగ ఉమ, అమర్నాథ్, జనసేన నాయకులు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలో చేరిన వైసీపీ దళిత నేత

వైసీపీ దళిత నేత పసల రవి టీడీపీలో చేరారు. ఆయనకు బొజ్జల సుధీర్ రెడ్డి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు విజయ్ కుమార్, నాయకులు నారాయణ, సన్నీ, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



ఎన్డీఏకి అండగా నిలవండి

తిరుపతి బీజేపీ ఎంపీ అభ్యర్థి వెలగపల్లి వరప్రసాదరావు





మందకృష్ణతో మాట్లాడుతున్న వరప్రసాదరావు - నల్లపరెడ్డి జగన్‌మోహన్‌రెడ్డితో వరప్రసాదరావు తదితరులు

చంద్రగిరి/గూడూరు/కోట, ఏప్రిల్ 19: రాష్ట్రాభివృద్ధికి ఎన్డీఏ కూటమి కృషి చేస్తుందని, అటువంటి కూటమికి అందరూ అండగా ఉండాలని తిరుపతి బీజేపీ ఎంపీ అభ్యర్థి వెలగపల్లి వరప్రసాదరావు పిలుపునిచ్చారు. శుక్రవారం చంద్రగిరిలో ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణతో సమావేశం అయ్యారు. ఎమ్మార్పీఎస్ అనుబంధ సంఘం ఎంఎస్పీ సమావేశంలో మందాకృష్ణ మాదిగతో కలసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మందకృష్ణ మాట్లాడుతూ... ఎమ్మార్పీఎస్ లక్ష్యాలను అర్థం చేసుకున్న వ్యక్తి వరప్రసాదరావు అని ఆయనకు అండగా ఉంటామని ఆయన గెలుపునకు కృషి చేస్తామన్నారు. అనంతరం వరప్రసాదరావు మాట్లాడుతూ వైసీపీ అరాచక ప్రభుత్వాన్ని సాగనంపేందుకు కలసి కట్టుగా ముందుకురావాలని పిలుపునిచ్చారు.

గూడూరులో ...

తిరుపతి బీజేపీ ఎంపీ అభ్యర్థి వెలగపల్లి వరప్రసాదరావు శుక్రవారం ఉదయం గూడూరులో పలు ప్రాంతాలలో ప్రచారం నిర్వహించారు. తాను ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో చేసిన అభివృద్ధిని వివరించారు. ఎంపీగా తనకు ఓటు వేసి గెలిపించాలని పిలుపునిచ్చారు. అనంతరం పార్కుకు వెళ్లి అక్కడ స్థానికులతో మాటామంతి జరిపారు. పార్కు అభివృద్ధికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

దళితులంటే జగన్‌కు చులకన...

సీఎం జగన్‌కు దళితులంటే చాల చులకన భావమని, అందుకే 23 మంది దళిత ఎమ్మెల్యేలకు టిక్కెట్లు నిరాకరించారని తిరుపతి బీజేపీ ఎంపీ అభ్యర్థి వెలగపల్లి వరప్రసాదరావు దుయ్యబట్టారు. శుక్రవారం సాయంత్రం కోట పట్టణంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. అనంతరం ఎన్డీసీసీబీ మాజీ వైఎస్ చైర్మన్ నల్లపరెడ్డి జగన్ మోహన్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. టీడీపీలో చేరుతున్న ఆయనకు అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా జగన్ మోహన్‌రెడ్డి మాట్లాడుతూ... రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే బీజేపీ, టీడీపీతోనే సాధ్యమన్నారు. ఈ సమావేశంలో వారితోపాటు బీజేపీ నాయకులు పురుషోత్తమరెడ్డి, కోటేశ్వరరావు, రమేష్‌బాబు, అంబరీష్ తదితరులు పాల్గొన్నారు.

వేడుకగా పెద్దకొట్టాయి ఉత్సవం

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 19: శ్రీకాళహస్తీశ్వరాలయంలో శుక్రవారం పెద్ద కొట్టాయి ఉత్సవం ఘనంగా జరిగింది. ఆలయంలోని అలంకార మండపంలో స్వామి అమ్మవార్ల ఉత్సవమూర్తులను సుగంధ పరిమళభరిత పుష్పమాలలు, స్వర్ణాభరణాలతో అలంకరించారు. అక్కడి నుంచి ఆలయంలోని కోట మండపం వద్ద పగడ చెట్టు కింద సాయంత్రం స్వామి అమ్మవార్ల ఉషోమూర్తులను కొలువుదీర్చారు. వట్టివేర్లతో చలువ వాతావరణం కల్పించారు. అనంతరం విశేష అభిషేకాలు పూజలు నిర్వహించారు. ధూప దీప నైవేద్యాలను సమర్పించి తర్వాత తిరిగి ఆలయంలోని అలంకార మండపంలో కొలువుదీర్చారు. భక్తులు దర్శించుకుని ముక్కులు సమర్పించుకున్నారు.

పోస్టల్ బ్యాలెట్ కోసం ఇంటింటి సర్వే

బుచ్చినాయుడుకండ్రిగ, ఏప్రిల్ 19: దివ్యాంగులు, 80 సంవత్సరాలు దాటిన వృద్ధులకు పోస్టల్ బ్యాలెట్ సౌకర్యం కల్పించేందుకు అధికారులు ఇంటింటి సర్వే శుక్రవారం నిర్వహించారు. మండల వ్యవసాయ అధికారి భారతి మాట్లాడుతూ వృద్ధులు, దివ్యాంగులు ఇంటి వద్ద నుంచే పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు వేయడానికి ఎన్నికల సంఘం అవకాశం కల్పించిందన్నారు. కార్యక్రమంలో ఏఎస్ఐ రమేష్‌బాబు, బీఎల్‌లో ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

9మంది వలంటీర్లు రాజీనామా

తొట్టంబేడు, ఏప్రిల్ 19: మండలంలోని బసవయ్యపాళెం సచివాలయ పరిధిలో 9మంది వలంటీర్లు శుక్రవారం రాజీనామా చేశారు. ఎంపీడీవో ఐజాక్ ప్రవీణ్‌ను కలిసి రాజీనామా పత్రాలను అందజేశారు.

అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన

రేణిగుంట, ఏప్రిల్ 19: అమరరాజా ఆస్పత్రిలో అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన కార్యక్రమాన్ని అగ్నిమాపకశాఖ నిర్వహించింది. శుక్రవారం అగ్ని ప్రమాదం సంభవించినపుడు మంటలను ఎలా అదుపులోకి తీసుకురావాలో ఆస్పత్రిలో పనిచేస్తున్న సెక్యూరిటీ సిబ్బందికి డీఎఫ్‌వో రమణయ్య నేతృత్వంలో అవగాహన కల్పించారు. అగ్నిమాపక అధికారి కిరణ్‌కుమార్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

అవగాహనతో అగ్ని ప్రమాదాల నివారణ

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 19: అవగాహనతో అగ్ని ప్రమాదాలను నివారించవచ్చని శ్రీకాళహస్తి అగ్నిమాపక అధికారులు నాగేశ్వర రెడ్డి అన్నారు. శుక్రవారం పట్టణ శివారులోని ఎంజీఎం ఆస్పత్రిలో అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన కల్పించారు. ఆస్పత్రిలో ఉన్న అగ్నిమాపక వ్యవస్థను ఆపద సమయంలో ఎలా ఉపయోగించాలో సిబ్బందికి వివరించారు.

శుక్రవార ఉత్సవం

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 19: శ్రీకాళహస్తీశ్వరాలయంలో శుక్రవారాన్ని పురస్కరించుకుని అమ్మవారికి విశేష ఉత్సవం నిర్వహించారు. అలంకార మండపంలో జ్ఞానప్రసూనాంబిక అమ్మవారి ఉత్సవమూర్తిని ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం ఆలయంలో ప్రాకారంగా ప్రదక్షణ చేసి తిరిగి కొలువు తీర్చారు. భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

పచ్చని చెట్లు ప్రగతికి మెట్లు

తొట్టంబేడు, ఏప్రిల్ 19: పచ్చని చెట్లు ప్రగతికి మెట్లు అని ప్రధానోపాధ్యాయురాలు రాజకుమారి అన్నారు. శ్రీకాళహస్తి మండలంలోని ఊరందూరులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో శుక్రవారం మొక్కలు నాటారు. ఉపాధ్యాయులు సురేష్, శాంతి, రమేష్‌రెడ్డి, మల్లికార్జున, రజియా, మురళి, అనూష, హిమబిందు పాల్గొన్నారు.

సుధీర్‌రెడ్డి గెలవాలని పూజలు

రేణిగుంట, ఏప్రిల్ 19: టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థి బొజ్జల సుధీర్‌రెడ్డి విజయం సాధించాలని టీడీపీ నాయకులు ప్రత్యేక పూజలు చేశారు. శుక్రవారం నడివీధి గంగమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించి 101 టెంకాయలు కొట్టారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు పుష్పనాథన్, ఎంజీ రాజేష్‌రెడ్డి, కన్నన్‌రెడ్డి, నాదమునిరెడ్డి, నరసింహులు, రవి తదితరులు పాల్గొన్నారు. అలాగే పట్టణంలో టీడీపీ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. పట్టణాధ్యక్షుడు మెహబూబ్‌బాషా, నాయకులు పుష్పనాథన్, మునీర్, ఎంజీ రాజేష్‌రెడ్డి, కన్నన్‌రెడ్డి, మురళి, సుబ్రహ్మణ్యం, శివయ్య,దినేష్, సంపత్, సుధా, చైతన్య, రవి, అమర్‌నాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మృతదేహం అప్పగింత

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 19: అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన గౌరీ(30) మృతదేహాన్ని పోలీసులు బంధువులకు అప్పగించారు. శ్రీకాళహస్తి పట్టణంలో నివాసం ఉంటున్న గౌరీ గురువారం అనుమానాస్పదస్థితిలో మృతి చెందిన విషయం తెలిసిందే. శుక్రవారం ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో పోస్టుమార్టం పూర్తి చేశాక మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు.

బీజేపీతో రాజ్యాంగానికి ముప్పు: సీపీఎం

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 19: బీజేపీ మతతత్వ విధానాలతో రాజ్యాంగానికి ముప్పు తప్పదని సీపీఎం జిల్లా కార్యదర్శి నాగరాజు అన్నారు. శ్రీకాళహస్తి పట్టణంలోని పుచ్చలపల్లి సుందరయ్య భవనంలో శుక్రవారం సీపీఎం నియోజకవర్గ కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ... వచ్చే ఎన్నికల్లో బీజేపీ కూటమి గెలుపొందితే మతతత్వం మరింతగా విజృంభిస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యుల పుల్లయ్య, పట్టణాధ్యక్షుడు గంధం మణి తదితరులు పాల్గొన్నారు.

సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల పరిశీలన

తొట్టంబేడు, ఏప్రిల్ 19: మండలంలోని బోనుపల్లి, చిట్టత్తూరు, కంచనపల్లిలోని సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను శుక్రవారం పరిశీలించినట్లు ఎస్ఐ రాఘవేంద్ర తెలిపారు. అనంతరం కేంద్ర బలగాలు కవాతు నిర్వహించాయి.

పుత్తూరు వార్తలు

రోజా నామినేషన్‌కు... అసమ్మతి నాయకుల డుమ్మా

పుత్తూరు అర్బన్, ఏప్రిల్ 19: నగరి నియోజకవర్గ వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి రోజా నామినేషన్ కార్యక్రమానికి అసమ్మతి నాయకులు డుమ్మా కొట్టడం చర్చనీయాంశంగా మారింది. శుక్రవారం మంత్రి రోజా నగరిలో నామినేషన్ దాఖలు చేశారు. ఈ కార్యక్రమానికి నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న వైసీపీ కేడర్ హాజరుకాగా, కీలకమైన అసమ్మతి నాయకులు ముఖం చాటేయడం ఆ పార్టీలోని అంతర్గత విభేదాలు ఇంకా చల్లారలేదనే మాటలు వినబడుతున్నాయి. నిండ్రకు చెందిన శ్రీశైలం ట్రస్ట్ బోర్డు చైర్మన్ రెడ్డివారి చక్రపాణిరెడ్డి, పుత్తూరుకు చెందిన మాజీ ఎంపీపీ ఏలుమలై మొదలియార్(అమ్ములు), వడమాలపేట జడ్పీటీసీ మురళీధర్‌రెడ్డి, నగరికి చెందిన కేజే కుమార్ దంపతులు, విజయపురానికి చెందిన లక్ష్మీపతిరాజు, పుత్తూరు మండలానికి చెందిన రవిశేఖర్‌రాజు మంత్రి రోజాతో విభేదించి అసమ్మతి నాయకులుగా కొనసాగుతున్నారు. మంత్రి రోజాకు ఎమ్మెల్యే టికెట్ ఇవ్వద్దని అధిష్టానానికి అసమ్మతి నాయకులు పలుమార్లు మొరపెట్టుకున్నారు. అయినా వారి అభ్యర్థన అరణ్యరోదనే అయ్యింది. దీంతో అసమ్మతి నాయకులు పార్టీ కార్యక్రమాలకు దూరం జరిగారు. ఎన్నికల షెడ్యూల్ విడుదలయ్యాక పార్టీ అధిష్టానం పలుమార్లు ఇరువర్గాలను కలిసే ప్రయత్నం చేసినా ఫలితం ఇవ్వలేదు. శుక్రవారం నామినేషన్ కార్యక్రమానికి అసమ్మతి నాయకులు గైర్హాజరయ్యారు. ఈ పరిణామాలు వైసీపీ గెలుపోటములపై తీవ్ర ప్రభావమే చూపనున్నాయనే మాటలు వినబడుతున్నాయి.

అరాచక పాలనకు స్వస్తి పలకండి: భానుప్రకాష్



తిరుమణ్యంలో కరపత్రాలు అందిస్తున్న భాను ప్రకాష్

వడమాలపేట, ఏప్రిల్ 19: భూదందాలు, ఇసుక మాఫియాతో అరాచక పాలన సాగిస్తున్న వైసీపీ ప్రభుత్వానికి స్వస్తి పలకాలని నగరి నియోజకవర్గ టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గాలి భానుప్రకాష్ కోరారు. శుక్రవారం వడమాలపేట మండలంలోని తిరుమణ్యంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. సూపర్ సిక్స్ పథకాలను ప్రజలకు వివరిస్తూ కరపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా భానుప్రకాష్ మాట్లాడుతూ నీతివంతమైన పాలన కోసం టీడీపీని గెలిపించాలని కోరారు. అక్రమంగా సంపాదించిన డబ్బుతో మభ్యపెట్టి ఎన్నికల్లో గెలవాలని ప్రయత్నిస్తున్న వైసీపీకి తగిన బుద్ధి చెప్పాలన్నారు. రాష్ట్రంలో టీడీపీ అధికారం చేపడితే అన్ని వర్గాల ప్రజలకు న్యాయం జరుగుతుందని చెప్పారు. ముద్దుకృష్ణమ నాయుడు కుమారుడిగా అభివృద్ధి చేసి చూపిస్తానని, విశ్వసించి ఆశీర్వదించాలని ఓటర్లను అభ్యర్థించారు. కార్యక్రమంలో ధనంజయులు నాయుడు, వెంకటయ్య, మణిరాజు, విశ్వనాద్, జ్యోతి, శీను, హరి, రామకృష్ణ, శివరాజు, సునీల్, రఘురామ్, దేవ, దాముయాదవ్, సుబ్రహ్మణ్యం యాదవ్, వెంకటేశ్వరావ్, బత్తినాయుడు, రవినాయుడు, రామూర్తి నాయుడు, శేషాద్రి యాదవ్, సుమకుర్, జనసేన నాయకులు మునిశేఖర్, చక్రవర్తి, బాలాజీ, వెంకటేష్, శేషాద్రి తదతరులు పాల్గొన్నారు.

రోజా స్థిర, చరాస్తులు 10.63 కోట్లు

పుత్తూరు అర్బన్, ఏప్రిల్ 19:నగరి ఎమ్మెల్యే రోజా నామినేషన్ సందర్భంగా సమర్పించిన అఫిడవిట్‌లో తన మొత్తం ఆస్తుల విలువ రూ.10.63కోట్లుగా పేర్కొన్నారు. చరాస్తులు రూ.4.58 కోట్లు. స్థిరాస్తులు రూ.6.05 కోట్లుగా పేర్కొన్నారు.రూ.1.59 కోట్లు విలువ చేసే నాలుగు కార్లు ఉన్నాయి. రూ.కోటి విలువ చేసే బెంజ్ కారు ఉంది. దాన్ని కొనేందుకు రూ.94లక్షలు బ్యాంక్ ద్వారా రుణం తీసుకున్నట్లు చూపించారు. వైసీపీ అధికారంలోకి వచ్చాక నగరి నియోజకవర్గంలో 6.39 ఎకరాల భూమి కొనుగోలు చేశారు. ఆమె మీద 2019 ఎన్నికల సమయం నాటికి కేసులు ఉండగా.. ఇప్పుడు కేసులేం లేవు.

స్కౌట్స్ అండ్ గైడ్స్ శిక్షణకు విద్యార్థుల ఎంపిక

వడమాలపేట, ఏప్రిల్ 19: వడమాలపేట జడ్పీ హైస్కూల్‌లో స్కౌట్స్ అండ్ గైడ్స్ శిక్షణకు 96మంది విద్యార్థులను ఎంపిక చేసినట్లు ప్రధానోపాధ్యాయురాలు కరుణ నవనీతం తెలిపారు. గైడ్ కెప్టెన్‌గా జయప్రద, స్కౌట్స్ మాస్టర్లు పీడీ.చంద్ర శేఖర్‌రాజు, వేలాయుదంను నియమించినట్లు చెప్పారు.

గజ వాహనంపై అగస్త్యేశ్వరస్వామి

నారాయణవనం, ఏప్రిల్ 19:నముదాయం గ్రామంలో ఉన్న అగస్త్యేశ్వరస్వామి బ్రహ్మోత్స వాల్లో శుక్రవారం రాత్రి స్వామివారిని గజ వాహనంపై ఊరేగించారు. అనంతరం ఉత్సవమూర్తులను తిరుచ్చి వాహనంపై ఆలయ అంతరప్రాకరంలో ఊరేగించారు.

యువకుడిపై దాడి

పుత్తూరు అర్బన్, ఏప్రిల్ 19: పాతకక్షల కారణంగా యువకుడిపై మరో వ్యక్తి దాడి చేసిన సంఘటన పుత్తూరులో జరిగింది. బాధితుడి కథనం మేరకు.. పట్టణ పరిధిలోని నందిమంగళం దళితవాడకు చెందిన దివ్యాంగుడైన శివ(40) వైసీపీ సోషల్ మీడియా కోఆర్డినేటర్‌గా ఉన్నారు. శుక్రవారం సాయంత్రం తన పిల్లలను ఇంటి నుంచి స్కూల్‌కు ద్విచక్ర వాహనంపై తీసుకువెళుతున్న క్రమంలో మరాఠీగేట్ వద్ద పట్టణంలోనే ఫ్లెక్సీ దుకాణం నడుపుతున్న శంకర్‌రాజు తన ద్విచక్ర వాహనంతో ఢీకొన్నాడు. ఈ సంఘటనలో బాధితుడు శివ కిందపడిపోగా అతనిపై మళ్లీ శంకర్‌రాజు దాడి చేశాడు. గాయాలపాలైన శివను స్థానికులు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం తిరుపతి రుయాకు తీసుకెళ్లారు. బాధితుడి బంధువులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.